ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com

మంగళవారం 13 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 117 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ఆరు రాష్ట్రాలకు గవర్నర్ల నియామకం

తమిళనాడుకు రాజేంద్రవిశ్వనాథ్ అర్లేకర్



కేంద్ర ప్రభుత్వం ఆరు రాష్ట్రాలకు గవర్నర్లను నియమించింది. కేరళం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడుకు బదిలీ చేసింది. ఇప్పటి వరకు ఆయన తమిళనాడు గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు నిర్వర్తించగా.. తాజాగా పూర్తి బాధ్యతలు అప్పగించింది. సిక్కిం గవర్నర్ ఓం ప్రకాశ్ మాథూర్.. కేరళానికి బదిలీ అయ్యారు.

-న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (సింగిడి)

2



ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

స్థూల ఆర్థిక స్థిరత్వంపై పరిశోధనకు గుర్తింపు

2



ఢిల్లీ వదిలి వెళ్లొద్దు

టీ కాంగ్రెస్ నేతలకు రేవంత్ రెడ్డి ఆదేశాలు

2

ఇది మరో స్వాతంత్ర్య పోరాటం

జ్ఞానేశ్‌కుమార్ గోబ్యాక్ పోరాటమే రేపు దేశాన్ని కాపాడుతుంది

- **ఓటిచ్చేందుకు అప్పుడు సర్ తీసుకొస్తే.. ఇప్పుడు బీజేపీ తెంచేస్తుంది**
- **బీజేపీకి పడని ఓట్లను తీసేయాలని జ్ఞానేశ్‌కు టాస్క్ ఇచ్చారు**
- **రాహుల్ చేపట్టిన ఈ ఉద్యమంలో అందరూ పాల్గొనాలి: సీఎం రేవంత్ పిలుపు**

గతంలో ఓటిచ్చేందుకు సర్ ప్రక్రియ తీసుకొస్తే.. ఇప్పుడు ఓట్లను తెంచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆనాడు సైమన్ గోబ్యాక్ ఉద్యమం గట్టిగా సాగిందని.. నేడు రాహుల్ గాంధీ చేపట్టిన జ్ఞానేశ్‌కుమార్ గోబ్యాక్ పోరాటం రేపు దేశాన్ని కాపాడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే బీజేపీ వ్యతిరేకుల ఓట్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (సింగిడి)

తక్షణమే సీఈసీ రాజీనామా చేయాలన్నారు. ఓటు బచావో.. దేశ్ బచావో ఆందోళనలో భాగంగా ఢిల్లీ తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

1950లో తొలిసారి..

అధికారాన్ని పదిలం చేసుకొనేందుకు ఈడీ, ఐటీ అనేక అస్త్రాలు ప్రయోగించిన బీజేపీ, ఇప్పుడు ఎస్ఐఆర్ అనే ఆయుధాన్ని ప్రయోగించిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఓటు హక్కు కల్పించేందుకు ఎస్ఐఆర్ తీసుకువస్తే, ఇప్పుడు ఓట్లను దూరం చేసేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపించారు. అంబేడ్కర్ ప్రపంచమంతా తిరిగి ఎన్నో రాజ్యాంగాలను అధ్యయనం చేశారని గుర్తు చేశారు. ఎంతో అధ్యయనం చేసి ఓటుహక్కును మన రాజ్యాంగంలో చేర్చారని, పాలకుడు రాచరికం, వంశపారంపర్యంగా కాకుండా ప్రజలు ఎన్నుకునే పద్ధతి తీసుకువచ్చారని కొనియాడారు. 1950లో తొలిసారి ఎస్ఐఆర్ పద్ధతిని అమలు చేశారని పేర్కొన్నారు.

2



ఈ కార్ రేసింగ్ కేసులో నా పేరు తొలగించండి

కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్

విచారణను కోర్టు ఈ నెల 30కి వాయిదా

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఫార్ములా-ఈ రేస్ నిర్వహణలో నిధుల మళ్లింపు, అవక తవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ చార్జిషీట్‌లో తనను ఏ-1 నిందితుడిగా పేర్కొనడాన్ని కేటీఆర్ సవాల్ చేశారు.

-హైదరాబాద్, అక్టోబర్ 12 (సింగిడి)

2



మెట్రో-ఆర్టీసీ కామన్ కార్డ్ ధరలపై పునరాలోచన

సమీక్షకు తెలంగాణ సర్కార్ నిర్ణయం

విమర్శలతో వెనక్కి తగ్గిన తెలంగాణ ప్రభుత్వం

మెట్రో-ఆర్టీసీ కామన్ కార్డ్ ధరల పునఃసమీక్షకు నిర్ణయం

ప్రస్తుత నెలవారీ ఛార్జీ రూ.8,500గా ఉండటంపై అభ్యంతరాలు

సామాన్యులకు అందుబాటులోకి తెస్తామన్న మంత్రి పొన్నం ప్రభాకర్

త్వరలో అధికారులతో సమావేశమై తుది నిర్ణయం

2

ప్రజారవాణా వ్యవస్థలకు అనుసంధానంగా పీఆర్‌టీఎస్

మూడు కారిడార్లకు సీఎం సుముఖత

సరికొత్త రవాణా వ్యవస్థ పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) కోసం అధికారులు ప్రతిపాదించిన నాలుగు కారిడార్లలో సీఎం రేవంత్ రెడ్డి ఐటీ కారిడార్‌లోని మూడింటికి ప్రాథమికంగా సమ్మతి తెలిపారు. మరో కారిడార్‌ను మరింత అభివృద్ధి చేసి తీసుకురావాలని సూచించారు. హైదరాబాద్‌లో మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ వంటి ప్రజారవాణా వ్యవస్థలకు కనెక్టివిటీగా పీఆర్‌టీ వ్యవస్థను వేగంగా తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు ప్రధానంగా నాలుగు కారిడార్లలో సాధ్యాసాధ్యాలను పరిశీలించే బాధ్యతలు లీ అసోసియేట్స్ అనే కంపెనీకి ఇటీవల అప్పగించారు. వీరిచ్చిన రిపోర్టు ను రేవంత్ రెడ్డి ఇటీవల పరిశీలించారు. హైటెక్‌సిటీ-రాయదుర్గం నాలెడ్జి సిటీ కారిడార్, కొండా పూర్- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ కారి డార్, రాయదుర్గం-కూకట్‌పల్లి కారిడార్లకు సుముఖత వ్యక్తం చేశారు.

-హైదరాబాద్ (సింగిడి)



2

నిరసన ప్రదేశాల జాబితా నుంచి జంతర్‌మంతర్ తొలగింపు

ఇక నుంచి జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అనుమతిని ఢిల్లీ పోలీసులు రద్దు

బదులుగా 3 ప్రత్యామ్నాయ ప్రాంతాలు

2

విజయవాడలో కాలిబూడిదైన ఈవీ కారు నలుగురి సజీవదహనం



2

విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

ప్రమాదం అనంతరం ఈవీ కారులో చెలరేగిన మంటలు

ఘటనా స్థలంలోనే నలుగురు మృతి, మరొకరి పరిస్థితి విషమం

నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన

మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు

విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉంది.

అమరావతి, అక్టోబర్ 12 (సింగిడి)

సుప్రీంకోర్టుకు ఇండీ కూటమి నేతల భారీ ర్యాలీ

పిటిషన్ దాఖలు చేసిన రాహుల్‌గాంధీ

కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు కుమ్మక్కై యువతను అణచివేస్తున్నారని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులు, మహిళలపై ఉద్దేశపూర్వకంగానే దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, సీజేఐ సూచన మేరకు రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అధికారికంగా నమోదైంది. విపక్ష నేతలను నేరుగా కలిసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. ఈ వ్యవహారం ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉన్నందున, అధికారికంగా పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. అంతకుముందు కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన నేతలు బస్సులో కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ బయలుదేరారు. విపక్షాల నిరసనల దృష్ట్యా ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు.

-న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (సింగిడి)



2

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ విపక్ష ఇండియా కూటమి ఢిల్లీలో చేపట్టిన 'చలో ఢిల్లీ - మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్ తదితర అగ్రనేతల నేతృత్వంలో వేలాది మంది కార్యకర్తలు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. కన్నాట్ ప్లేస్‌లోని బారాఖంబా జంక్షన్ నుంచి సుప్రీంకోర్టు వైపు సాగిన ఈ నిరసన ప్రదర్శనను భగవాన్ దాస్ రోడ్డు వద్ద పోలీసులు భారీ బారికేడ్లతో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, కాంగ్రెస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కాంగ్రెస్ నేత కన్హయ్య కుమార్ ఏకంగా బారికేడ్ల పైకెక్కి నిరసన తెలిపారు.

ఏపీలో ఐఏఎస్ అధికారుల బదిలీ

11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు..

ఆమ్రపాలికి కీలక శాఖ

ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు

తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు

మరో ఇద్దరికి అదనపు బాధ్యతలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు.

అమరావతి, అక్టోబర్ 12 (సింగిడి)

2

తిరుపతికి మహర్దశ

రూ.3,222 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

'తుడా' పరిధిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

శ్రీవారి భక్తుల కోసం భారీ వసతి, అన్నప్రసాద సముదాయాల నిర్మాణం

టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధి

నగరంలో ట్రాఫిక్‌ను తగ్గించేలా 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం



తిరుపతి పుణ్యక్షేత్రం అభివృద్ధిలో మరో కీలక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో మొత్తం రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. అమరావతిలోని తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులను ప్రారంభించారు.

అమరావతి, అక్టోబర్ 12 (సింగిడి)

'కొత్త ఫారం-6ను సుప్రీంకోర్టు ఆమోదించలేదు'

ఈసీ ప్రకటనపై సీజేఐ ఆగ్రహం



2

బిహార్ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు అంశంలో కొత్త ఫామ్-6పై ఎలాంటి తీర్పు ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తీర్పు వెలువరించినప్పుడు కొత్త ఫారం-6 అంశమే లేదని తెలిపింది. వివిధ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఉపయోగిస్తున్న ఫామ్-6లో చేసిన మార్పులను అత్యున్నత న్యాయస్థానం ఆమోదించిందన్న ఈసీ చేసిన ప్రకటనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దరఖాస్తులో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలించి తేలుస్తామని పేర్కొంది.

-న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (సింగిడి)

కోర్టులో ఉన్న అంశాలపై సమావేశం

న్యాయ నైతికతకు విరుద్ధం

రాహుల్, ఖర్గేలకు సీజేఐ లేఖ

సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఈసీ విషయంలో కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున లేవనెత్తాలనుకున్న సమస్యలపై విచారణ ఇప్పటికే సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. -న్యూఢిల్లీ (సింగిడి)



2

జనరల్ న్యూస్ సింగిడి

ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (సింగిడి)

ఆర్థిక శాస్త్రంలో 2026 సంవత్సరానికి గాను ఇద్దరికి నోబెల్ బహుమతి వరించింది. అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు నోబెల్ కమిటీ పురస్కారం ప్రకటించింది. స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు అనే అంశంపై వీరు చేసిన పరిశోధనలకు గుర్తింపు దక్కింది. సోమవారం స్టాక్‌హోమ్‌లో రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ ఏడాది నోబెల్ పురస్కారాల ప్రకటనల్లో ఇదే చివరిది.

ఆర్థిక స్థిరత్వానికి కొత్త నమూనాలు

ఏ దేశ ఆర్థిక వ్యవస్థలోనైనా వృద్ధి, మందగమనం సహజం. కొన్ని సందర్భాల్లో ఉత్పత్తి, వినియోగం పెరిగి ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయి. మరికొన్ని సందర్భాల్లో ద్రవ్యోల్బణం పెరగడం, పెట్టుబడులు తగ్గడం, నిరుద్యోగం అధికమవడం వంటి పరిణామాలు ఎదురవుతాయి. ఇలాంటి పరిస్థితులను నియంత్రించేందుకు ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు వివిధ ఆర్థిక విధానాలను అమలు చేస్తుంటాయి. అయితే, ఏ సమయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నది కీలకం. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేశారు. వారి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకోవడానికి, విధాన నిర్ణయాల ప్రభావాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి, వినియోగం వంటి అంశాల మధ్య సంబంధాలను మాత్రమే పరిశీలించకుండా, వ్యక్తులు, కుటుంబాలు, వ్యాపార సంస్థలు తీసుకునే నిర్ణయాలు మొత్తం ఆర్థిక వ్యవస్థపై ఎలా ప్రభావం చూపుతాయో వివరించేందుకు వీరి పరిశోధనలు దోహదపడ్డాయి.



గతంలో ఆర్థిక వ్యవస్థలోని వివిధ అంశాల మధ్య కనిపించే గణాంక సంబంధాల ఆధారంగా అనేక నమూనాలను రూపొందించేవారు. అయితే హాల్, వుడ్‌ఫోర్డ్ వ్యక్తిగత ఆర్థిక నిర్ణయాలకు ప్రాధాన్యం ఇచ్చే సూక్ష్మ ఆర్థిక సూత్రాల ఆధారంగా స్థూల ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేశారు. దీంతో ఆర్థిక వ్యవస్థలోని హెచ్చుతగ్గులను వివరించడంతోపాటు, వాటిని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలను మరింత మెరుగ్గా అంచనా వేసే అవకాశం ఏర్పడింది.

ఆ పరిశోధనల ఫలితంగా అభివృద్ధి చెందిన న్యూ కీనేసియన్ ఆర్థిక నమూనాలు ప్రస్తుతం కీలకంగా మారాయి. ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఏర్పడినప్పుడు దాన్ని అధిగమించేందుకు, ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు దాన్ని అదుపు చేసేందుకు ఎలాంటి విధానాలు అవసరమో విశ్లేషించడంలో ఇవి సహాయపడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల కేంద్ర బ్యాంకులు, ఆర్థిక మంత్రిత్వ శాఖలు ఇటువంటి నమూనాలను ఉపయోగిస్తున్నాయి.

ప్రభుత్వాలు పన్నులు, ప్రభుత్వ వ్యయం వంటి అంశాల్లో మార్పులు చేయడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను ప్రభావితం చేయగలవు. అలాగే కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు, ద్రవ్య సరఫరా వంటి అంశాల ద్వారా ఆర్థిక వ్యవస్థలో మార్పులకు ప్రయత్నిస్తాయి. ఈ చర్యలను సరైన సమయంలో తీసుకోవడం ద్వారా ఆర్థిక ఒడుదొడుకుల తీవ్రతను తగ్గించవచ్చని వీరి పరిశోధనలు వివరించాయి.

ఎవరీ రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్?

రాబర్ట్ ఈ. హాల్ 1943లో అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం పాలో ఆల్టోలో జన్మించారు. 1967లో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. స్థూల ఆర్థిక వ్యవస్థ, వినియోగం, ఆర్థిక వృద్ధి వంటి అంశాలపై ఆయన పరిశోధనలు చేశారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ 1955లో అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రం చికోపీలో జన్మించారు. 1983లో ఎంఐటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రస్తుతం కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ద్రవ్య విధానం, ఆర్థిక వ్యవస్థలో ధరల మార్పులు, కేంద్ర బ్యాంకుల నిర్ణయాల ప్రభావం వంటి అంశాలపై ఆయన పరిశోధనలు చేశారు.

1969లో ప్రారంభమైన ఆర్థిక శాస్త్ర నోబెల్

ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని అధికారికంగా ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర పురస్కారం అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు అయిన స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ 1968లో తన 300వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. తొలి బహుమతిని 1969లో రాగ్నర్ ఫ్రిష్, జాన్ టిన్‌బెర్గెన్‌లకు అందించారు. ఇది ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు పురస్కారాల్లో ఒకటి కాదు. అయితే, ఇతర నోబెల్ పురస్కారాల మాదిరిగానే దీనిని కూడా రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రదానం చేస్తుంది. ఈ పురస్కారం కింద విజేతలకు 12 మిలియన్ స్వీడిష్ క్రోనర్లు అందజేస్తారు. ఇది సుమారు 1.2 మిలియన్ అమెరికా డాలర్లకు సమానం. గత ఏడాది ఆర్థిక శాస్త్రంలో జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియాన్, పీటర్ హోవిట్‌లు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కొత్త సాంకేతికతలు, ఉత్పత్తి విధానాల్లో మార్పులు ఆర్థిక వృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు ఎలా దోహదపడతాయన్న అంశంపై వారు చేసిన పరిశోధనలకు గుర్తింపు లభించింది. వైద్యం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, సాహిత్యం, శాంతి విభాగాల్లో పురస్కారాల ప్రకటనలు ఇప్పటికే పూర్తయ్యాయి. తాజాగా ఆర్థిక శాస్త్రంలో విజేతలను ప్రకటించడంతో 2026 సంవత్సరానికి సంబంధించిన నోబెల్ పురస్కారాల ప్రక్రియ ముగిసింది.

ఇది మరో స్వాతంత్ర్య పోరాటం

బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని జ్ఞానేశ్ కుమార్‌ను టాస్క్ ఇచ్చారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. యువత, నిరుద్యోగులు, పేదల ఓట్లు తొలగించాలని జ్ఞానేశ్‌కుమార్ చూస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌లో తప్పులు జరగుతున్నాయని మిగతా ఇద్దరు ఈసీలు వ్యతిరేకించారని, జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు బయటపడిందని విమర్శించారు. అలాంటి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించేందుకు ప్రధాని మోదీకి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.

సర్ జరగని రాష్ట్రాల్లో ఓడిపోయారు..

"సర్ ప్రక్రియ జరగని రాష్ట్రాల్లో బీజేపీ ఓడిపోయింది. సర్ ప్రక్రియ జరిగిన బిహార్, బంగాల్‌లో బీజేపీ గెలిచింది. దేశంలో జనాభా పెరుగుతుంటే ఓటర్ల సంఖ్య కూడా పెరగాలి కదా. మరి దేశంలో ఓటర్ల సంఖ్య 97 కోట్ల నుంచి 81 కోట్లకు ఎందుకు తగ్గింది?. దళితులు, ఆదివాసీలు, యువత, నిరుద్యోగుల్లో బీజేపీపై వ్యతిరేకత ఉంది. దేశ మనుగడకు సంబంధించిన ఉద్యమంలో అందరూ పాల్గొనాలి అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన కల్పించేందుకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం తెలిపారు.

భారత స్వాతంత్ర్య పోరాటంలో లాలా లజపతిరాయ్, భగత్‌సింగ్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకుల త్యాగాలు చిరస్మరణీయమని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. 'సైమన్ గో బ్యాక్' ఉద్యమ సమయంలో లాలా లజపతిరాయ్ లాఠీచార్జీలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించడం ద్వారా అంబేద్కర్ సమానత్వానికి బాటలు వేశారని సీఎం కొనియాడారు.

ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వాల కాలంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు. అయితే, గతంలో ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన వారిని చేర్చడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టేవారని అన్నారు. ఇప్పుడు మోదీ, అమిత్ షాల పాలనలో మాత్రం ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారి పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీఎం మండిపడ్డారు. గతంలో ఈ ప్రక్రియను ప్రజలకు మేలు చేసే చర్యగా చూశారని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈసీఐ ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి మోదీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని నడిపిస్తోందని ఆరోపించారు.

గతంలో ఎన్నికల సంఘం ఒక్క కమిషనర్ నేతృత్వంలో పనిచేసేదని, అయితే, ఈ సంస్థలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రిగా పి.వి.నరసింహారావు ఉన్న సమయంలో ముగ్గురు కమిషనర్ల విధానాన్ని తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేవారని తెలిపారు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నేత భాగస్వామ్యంతో నియామక ప్రక్రియ సాగేదన్నారు. మోదీ ప్రభుత్వం 2023లో ఈ విధానాన్ని మార్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషనర్ల నియామక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చారని ఆరోపించారు.

ప్రతిపక్ష పార్టీలే కాకుండా అధికార పక్షంలో ఉన్నవారు కూడా ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి వంటి వారు ఈ అంశంపై గొంతెత్తడమే ఇందుకు సంకేతమని సీఎం వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ నియామకంలో ఎలాంటి కుట్ర లేదని మోదీ, అమిత్ షాలు భావిస్తే, ఆయనను తొలగించాలనే డిమాండ్లపై ఎందుకు స్పందించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వారు ఎందుకు అండగా నిలుస్తున్నారో సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు.

2014లో నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రి పదవికి పోటీ చేసిన సమయంలో దేశంలో సుమారు 81 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. 2019లో ఈ సంఖ్య సుమారు 91 కోట్లకు, 2024 ఎన్నికల నాటికి సుమారు 97 కోట్లకు చేరిందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. 2026లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఈ తొలగించే ఓట్ల సంఖ్యను 20 కోట్లకు పెంచే కుట్ర ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో దేశ జనాభా ఎంత? ప్రస్తుతం ఎంత? అనే వివరాలను పరిశీలించాలన్నారు. జనాభా పెరుగుతున్నప్పుడు ఓటర్ల సంఖ్య తగ్గడానికి కారణమేంటని సీఎం ప్రశ్నించారు.



ఢిల్లీ వదిలి వెళ్లొద్దు

న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (సింగిడి)

తెలంగాణ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. తాము చెప్పేంత వరకు దిల్లీ వదిలి వెళ్లొద్దని నేతలకు స్పష్టం చేశారు. సీఈసీ నిర్ణయాలు, సర్ అంశాలపై ఇండియా కూటమి నేతలు ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పెద్ద సంఖ్యలో దిల్లీకి తరలివెళ్లారు. పోరాటం మరికొన్ని రోజులు జరగనున్నందున వెళ్లిన వారంతా అక్కడే ఉండాలని సీఎం, పీసీసీ చీఫ్ ఆదేశించారు. మరోవైపు సోమవారం నిర్వహించిన ఇండియా కూటమి ర్యాలీలో లాఠీఛార్జ్, తొక్కిసలాట చోటు చేసుకుంది. పలువురు తెలంగాణ రాష్ట్ర నేతలు కిందపడటంతో స్వల్ప గాయాలయ్యాయి.

ప్రజారవాణా వ్యవస్థలకు అనుసంధానంగా పీఆర్‌టీఎస్

నాలుగో కారిడార్ సచివాలయం, ట్యాంక్‌బండ్, అసెంబ్లీ, లక్డీకాపూల్ చుట్టుపక్కల ప్రాంతాలతో కలిపి ప్రతిపాదన చేశారు. అయితే ఈ ప్రతిపాదిత మార్గాన్ని మరింత మెరుగుపరిచి మళ్లీ రావాలని సీఎం సూచించారు. రాణిగంజ్ వరకు కనెక్టివిటీపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎం అన్నారు. ఈ మార్గంలో రైల్వే ట్రాక్ వంటి సవాళ్లున్నాయనే చర్చ విస్తృతంగా జరిగింది.

సురక్షిత సాంకేతికతకు మొగ్గు

పీఆర్‌టీఎస్ కిలోమీటరు నిర్మాణానికి రూ.120 కోట్ల నుంచి రూ.180 కోట్ల వరకు ఖర్చు అవుతోంది. ఇందులో అత్యంత సురక్షితమైన సాంకేతికతను వినియోగించాలని, రెవెన్యూ కంటే భద్రతే అత్యంత ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సీఎం అంగీకారం తెలిపిన మూడు కారిడార్లలో ఏ మార్గం నుంచి వెళితే ఎక్కువ మందికి ప్రయోజనం ఉంటుంది, భద్రతపరమైన ఇలా తదితర అంశాలను ఏజెన్సీ రీసెర్చ్ చేస్తుంది. ప్రతి కారిడార్‌కు మూడు ప్రత్యామ్నాయాలను ఈ సంస్థ సూచించనున్నట్లు వెల్లడించింది.

మరోసారి జీసీ గడువు పొడిగింపు

పాతబస్తీతో సహా నాలుగు మెట్రోరైలు కారిడార్ల పర్యవేక్షించడానికి పిలిచిన జనరల్ కన్సల్టెన్సీ(జీసీ) టెండరు గడువును హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు అధికారులు మరోసారి పొడిగించినట్లు వెల్లడించారు. మొదటిసారి పొడిగించిన అక్టోబరు 8 గడువు ముగిసేనాటికి వివిధ సంస్థల నుంచి స్పందన అంతగా లేకపోవడంతో ఈనెల 22 వరకు గడువు పొడిగించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

మెట్రో-ఆర్టీసీ కామన్ కార్డ్ ధరలపై పునరాలోచన

హైదరాబాద్, అక్టోబర్ 12 (సింగిడి)

హైదరాబాద్‌లో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి ఇటీవల ప్రవేశపెట్టిన 'కామన్ మొబిలిటీ కార్డ్' ధరలపై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నెలవారీ పాస్ ధర రూ.8,500గా నిర్ణయించడంపై ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో, ఛార్జీలను సమీక్షించాలని సర్కార్ నిర్ణయించింది. సామాన్యులకు అందుబాటులో ఉండేలా ధరలను మార్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 2న ఈ కామన్ కార్డ్‌ను ప్రారంభించారు. అయితే, దీని ధరలు సామాన్యులకు పెనుభారంగా ఉన్నాయన్న అభిప్రాయాలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచన మేరకు ఛార్జీల సమీక్షకు నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం తెలిపారు. త్వరలోనే ఉన్నతాధికారులతో సమావేశమై, ధరలను తగ్గించే విషయంపై చర్చిస్తామని ఆయన వెల్లడించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, రోజువారీ పాస్ ధర రూ.400, నెలవారీ పాస్ ధర రూ.8,500గా ఉంది. నెలవారీ పాస్‌లో మెట్రోకు రూ.7,000, ఆర్టీసీకి రూ.1,500గా విభజించారు. కార్డు తీసుకునేటప్పుడు రూ.100 రిఫండబుల్ డిపాజిట్ కూడా చెల్లించాలి. అధికారులతో జరగబోయే సమావేశం తర్వాత కొత్త ధరలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే, సమీక్ష ఎప్పటిలోగా పూర్తవుతుంది, కొత్త ధరలు ఏ మేరకు తగ్గుతాయనే దానిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.

తిరుపతికి మహర్దశ

ఈ కార్యక్రమం ద్వారా శ్రీవారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను నెరవేర్చడం, నగరంలో మౌలిక వసతులను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టులలో అత్యంత కీలకమైనది ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్. తిరుమల కొండపై రద్దీని తగ్గించే లక్ష్యంతో కొండ కిందనే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకేచోట ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో 2,700 గదుల వసతి సముదాయాలను నిర్మించనున్నారు. దీనివల్ల రోజుకు సుమారు 15 వేల మంది భక్తులకు వసతి అందుబాటులోకి వస్తుంది. అలాగే, ఒకేసారి 6 వేల మందికి అన్నప్రసాదం అందించేలా రూ.160 కోట్లతో భారీ అన్నప్రసాద కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. రూ.486 కోట్లతో నిర్మించే నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లలో ఒకేసారి 16 వేల మంది భక్తులు స్నానం, విశ్రాంతి తీసుకునే సౌకర్యం కలుగుతుంది. వీటితో పాటు రూ.311 కోట్లతో 4,500 వాహనాలకు సరిపడా బహుళ అంతస్తుల పార్కింగ్, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగమే. మరోవైపు, టీటీడీ ఉద్యోగుల దశాబ్దాల కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో రెండు దశల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

నగర అభివృద్ధిలో భాగంగా, తిరుపతిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ఈ సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో తిరుపతి రూపురేఖలు మారి, ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధి చెందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విజయవాడలో కాలిబూడిదైన ఈవీ కారు.. నలుగురి సజీవదహనం

పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కోర్టులో ఉన్న అంశాలపై సమావేశం న్యాయ నైతికతకు విరుద్ధం

ఒక విషయంపై పిటిషన్ పరిశీలనలో ఉన్నప్పుడు దాని గురించి ఇతరులతో చర్చించడం రాజ్యాంగం ప్రకారం అధికార విభజన సూత్రానికి, న్యాయపరమైన ఔచిత్యానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. సీఈసీ జ్ఞానేశ్, ఈసీ, పలువురు విద్యార్థుల అక్రమ అరెస్టులు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు వంటి అంశాలపై వినతిపత్రం సమర్పించేందుకు ఖర్గే, రాహుల్ గాంధీ కోరిన సమావేశ అభ్యర్థనను తిరస్కరిస్తూ సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై వీరిద్దరికి మెయిల్‌లో లేఖ పంపారు.

'కొత్త ఫారం-6ను సుప్రీంకోర్టు ఆమోదించలేదు'

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం సోమవారం బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఫామ్-6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని కోరారు. దీనిపై స్పందించిన జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, కొత్త ఫామ్-6పై ఎలాంటి న్యాయ నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. బిహార్ ఎస్ఐఆర్ వ్యవహారంపై గతంలో విచారణ జరిపినప్పుడు కొత్త ఫామ్-6 అంశం తమ ముందుకు రాలేదని ఆయన పేర్కొన్నారు. బిహార్ ఎస్ఐఆర్ అంశంలో మేలో సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. ఆ తీర్పులో ఫామ్-6ను ఎస్ఐఆర్ ధ్రువీకరణ ప్రక్రియకు మార్గదర్శకంగా పేర్కొంది. అప్పట్లో బిహార్‌లో ఉపయోగించిన ఫామ్-6 పత్రాల పరిశీలనకు ఒక విధానాన్ని నిర్దేశిస్తోందని వివరించింది. ధ్రువీకరణ ప్రక్రియకు ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా పూర్తిగా అధికారుల వ్యక్తిగత నిర్ణయాలపై వదిలేయడం ఆచరణ సాధ్యం కాదని, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం రూపొందించిన ఫామ్-6, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(2) కింద చేపట్టే ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియకు అనుగుణంగా ఉండాలని ఆ తీర్పులో పేర్కొన్నారు.

ఎన్నికల సంఘం ప్రకటనపై చర్చ

2026 సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం ఒక ప్రకటనను విడుదల చేసింది. అందులో బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించి 2026 మేలో ఇచ్చిన తీర్పులో ఫామ్-6లోని ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు పేర్కొంది. దాని ప్రకారం, కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వ్యక్తులు గతంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలతో తమకు ఉన్న సంబంధాన్ని వివరించే అదనపు డిక్లరేషన్‌ను సమర్పించాల్సి వచ్చింది. దరఖాస్తుదారులు తాము, తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతలు గత ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాల్లో నమోదై ఉన్నారా? అనే వివరాలు వెల్లడించాలి. ఈ వివరాల ద్వారా పాత ఓటర్ల జాబితాలతో అనుసంధానాన్ని గుర్తించే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం తప్పనిసరి చేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేయకుండా ఫామ్-6 దరఖాస్తులను సమర్పించలేని పరిస్థితి ఏర్పడింది.

ఈ మార్పులపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై అక్టోబర్ 5న విచారణ సందర్భంగా కూడా ప్రధాన న్యాయమూర్తి ఈ అంశంపై స్పందించారు. వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం ఉపయోగిస్తున్న ఫామ్-6లో చేసిన మార్పులను తాము ఆమోదించలేదని తెలిపింది. ఫామ్-6 అనేది 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల షెడ్యూల్‌లో పొందుపరిచిన చట్టబద్ధమైన పత్రం. ఇందులో మార్పులు చేయాలంటే తగిన చట్టపరమైన ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని పిటిషన్‌లో వాదించారు. ఏకపక్షంగా పరిపాలనా నిర్ణయాల ద్వారా ఇటువంటి మార్పులు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.



సుప్రీంకోర్టుకు ఇండీ కూటమి నేతల భారీ ర్యాలీ

ర్యాలీ సాగే మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బారాఖంబా జంక్షన్ నుంచి మండి హౌస్ వరకు భద్రతా బలగాలను భారీగా మోహరించి, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

"ఈ రోజు దేశమంతా రోడ్లపైకి వచ్చింది. రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఇక్కడకు చేరుకున్నారు. మా అందరి డిమాండ్ ఒక్కటే సుప్రీంకోర్టు మా వాదనను వినాలి. CEC చేసిన పని చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం. ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సిందే. మేము బయటపెట్టిన 'ఓట్ల చోరీ'కి సంబంధించిన ఆధారాలు, ఈ దేశంలో ప్రజాస్వామ్య

రైతు నేస్తం ముఖ్యమంత్రి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 12 (సింగిడి): నేడు రైతు నేస్తం పై సీ ఎం ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని ఏ వో జ్యోతి తెలిపారు. సోమవారం సమయం ఉదయం 10 గంటల నుండి ప్రజాప్రతినిధులకు, వివిధ శాఖల అధికారులకు మరియు రైతు సోదర సోదరీమణులకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రబీ సీజన్‌కు పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ, అనువైన పంటల ఎంపిక, పంటల సాగు మరియు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించబడుతుందని ఆమె చెప్పారు. ఈ నేపథ్యంలో మండలంలోని స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు. రైతులు మహిళా రైతులు సమీపంలోని రైతు వేదికకు ఉదయం 10:30 గంటలకే చేరుకొని, కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. నవాబుపేట రైతు వేదిక, ఎల్లకొండ రైతు వేదిక, చించల్ పేట రైతు వేదిక లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

శివాజీ మహారాజ్ మత నాయకుడు కాదు.. ప్రజా నాయకుడు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి బైపాస్ రోడ్‌లో చత్రపతి విగ్రహా ఏర్పాటుకు భూమి పూజ



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (సింగిడి): ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఒక మతానికి పరిమితం చేయడం సరికాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, రాజ్య భద్రతకు ప్రాధాన్యమిచ్చిన గొప్ప ప్రజా నాయకుడు శివాజీ అని పేర్కొన్నారు. శివాజీ చరిత్రను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం వక్రీకరించి ప్రచారం చేస్తోందని జగ్గారెడ్డి ఆరోపించారు. శివాజీ పాలనలో హిందువులతో పాటు ముస్లింలు కూడా ఉన్నారని, దౌలత్ ఖాన్, ముల్లా హైదర్ వంటి ముస్లిం అధికారులు ఉన్నత స్థాయిలో పనిచేశారని ఆయన తెలిపారు. కులమతాలకు అతీతంగా తన రాజ్యంలోని ప్రజల బాగోగుల కోసం శివాజీ కృషి చేశారని అన్నారు. గొప్ప వీరుడైన శివాజీ ప్రజల సంక్షేమం పట్ల నిబద్ధతతో పాలన సాగించారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఒక రాజుగా ముస్లిం పాలకులతో యుద్ధాలు చేశారే తప్ప, ముస్లిం ప్రజలపై దాడులు చేయలేదని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాలకు మతపరమైన అర్థాలు ఆపాదించడం సరికాదని అన్నారు. యువత శివాజీ మహారాజ్ చరిత్రను అధ్యయనం చేసి, ఆయన వీరత్వం, పాలనా దక్షత, ప్రజల పట్ల నిబద్ధతను తెలుసుకోవాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మహనీయుల చరిత్రను వక్రీకరించడం తగదని ఆయన పేర్కొన్నారు.

శ్రీ వెంకటేశ్వర కాలనీలో వైభవంగా గాయత్రీ మాత ఆలయ తృతీయ వార్షికోత్సవం, దసరా శరన్నవరాత్రులు

ఘనంగా 108 కుండలతో అష్టోత్తర శతకలశాభిషేకం, సహస్రనామ అర్చన



రాజేంద్రనగర్, అక్టోబర్ 12 (సింగిడి): శ్రీ వెంకటేశ్వర కాలనీలో కొలువై ఉన్న మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి స్వరూపిణి, లోకమాత శ్రీ గాయత్రీ మాత ఆలయ తృతీయ వార్షికోత్సవం, దసరా శరన్నవరాత్రుల వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నార్సింగి సర్కిల్ నేక్నాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో సోమవారం ఉదయం 7:00 గంటలకు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. అష్టోత్తర శతకలశాభిషేకం: అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన రీతిలో 108 కుండలతో వైభవంగా అభిషేకం నిర్వహించబడుతుంది. **సహస్రనామ అర్చన:** భక్తులందరూ, ముఖ్యంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దివ్య నామాలను స్మరిస్తూ సహస్రనామ అర్చనలో పాలుపంచుకోనున్నారు. ?దసరా శరన్నవరాత్రులు, వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తాదులందరూ పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా విచ్చేసి, అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆలయ కమిటీ చైర్మన్ సాదరంగా ఆహ్వానించారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (సింగిడి): తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో ఇటీవల జరిగిన కార్మిక సంఘాల ఎన్నికల్లో జేడిమెట్ల డిపో నుంచి బరిలోకి దిగిన ఎంప్లాయిస్ యూనియన్ – ఈఎంయూ – ఎన్ఎంయూ కూటమి ప్రత్యర్థి కూటమి అయినా ఈడబ్ల్యూయూ – టిడబ్ల్యూయూ – ఐఎన్టియుసి కూటమిపై 68 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా జాలిగం రాకేష్ గౌరవ అధ్యక్షులుగా గెలిచారు. ఈ సందర్భంగా ఈరోజు ఉదయం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద జేడిమెట్ల డిపోకు చెందిన ఎంప్లాయిస్ యూనియన్ – ఈఎంయూ – ఎన్ఎంయూ కూటమి సభ్యులు గౌరవాధ్యక్షులు జాలిగం రాకేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ. కార్మిక సంఘాల ఎన్నికలలో గెలుపు కార్మికుల సంక్షేమం పట్ల నూతన కమిటీ సభ్యులపై మరింత బాధ్యతను పెంచుతుందని, కార్మిక సంక్షేమం విషయంలో నూతన కమిటీకి నావంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన జాలిగం రాకేష్ ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రెటరీ కోల రాజేష్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రాపోలు, బాబు, అధ్యక్షులు జ్ఞానేశ్వర్, జేఏసీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, సభ్యులు పాషా, అంకం రావు, బిఎల్.నారాయణ, మహిళా నాయకురాలు క్రిష్ణా భాయ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అందరికీ సమన్యాయం బిజెపితోనే సాధ్యం

- బిజెపి మాజీ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్
- నరేంద్రమోడీ పథకాలకు ఆకర్షితులవుతున్న ప్రజలు
- బిజెపిలో భారీగా చేరికలు





సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (సింగిడి): సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండల పరిధిలోని శివంపేట గ్రామంలో ఆదివారం భారతీయ జనతా పార్టీలో ఘనంగా చేరికలు జరిగాయి. ముఖ్యంగా శివంపేట గ్రామం తో పాటు, చక్రియాలు, వెండికోల్, అంగడిపేట్ తదితర గ్రామాల ప్రజలు కూడా వచ్చి బిజెపి లో 100కు పైగా కార్యకర్తలు బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో చేరినారు. పార్టీలకు వచ్చిన వారికి గోదావరి అంజిరెడ్డి,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బేబీ పాట పార్టీకండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వం రావడం ఖాయమని, అందరికీ సమన్యాయం బిజెపితోనే సాధ్యం అవుతుందని, సబ్కా సాత్ సబ్కా వికాస్ అనే నినాదంతో నరేంద్ర మోడీ ముందుకు వెళ్లడంతో పాటు ప్రజల గురించి ఆలోచించి చేసే పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. అందోల్ నియోజకవర్గం లోని శివంపేట గ్రామంలో నిర్వహిస్తున్నఈ కార్యక్రమం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ నేడు జిల్లాలో ఎటు చూసినా బిజెపి హవా కొనసాగుతుందని, ముఖ్యంగా తెలంగాణ అమలవు తున్న పథకాలు కేంద్ర ప్రభుత్వానివే అన్నారు. నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా పది సంవత్సరాలు, దేశ ప్రధానిగా మూడోసారి ఎన్నికై కూడా ఎంతో సమర్థవంతంగా పరిపాలన కొనసాగిస్తున్నందుకు దేశ ప్రజలే కాకుండా ఇతర దేశస్తులు కూడా మోడీకి జేజేలు పలుకు తున్నారన్నారు. నేడు ముఖ్యంగా ప్రధాని పరిపాలనకు ఆకర్షితులై యువత పార్టీలో చేరడం జరుగుతుం దన్నారు. తాను జిల్లా అధ్యక్షురాలిగా పార్టీ పనిచేసే కార్యకర్తను ప్రతి ఒక్కరిని గుర్తుంచుకుంటానన్నారు. కార్యకర్తనే పార్టీకి పునాది రాయి అన్నారు. బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు చంటి ప్రభు మాట్లాడుతూ ఇటు కాంగ్రెస్ అటు టిఆర్ఎస్ దొందు దొందే అన్నారు. వారి ద్వారా ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. కార్యకర్తకు ఎలాంటి కష్టం వచ్చినా ఎల్లప్పుడూ అండగా ఉంటా కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. అంతకుముందు గ్రామంలో గల అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు పల్వట్ల జగదీశ్వర్, మామయ్య, వేదిక, నరేన్, సురేష్, శ్రీ పాల్, అశోక్ బాబు, రాజారాం, సుమన్, మల్లేశం సతీష్ లతోపాటు వందనాదిగా కార్యకర్తలు పాల్గొన్నారు.

హరీశ్‌రావు దుబ్బాకకు చేసిన అభివృద్ధి ఏది.?

దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్



సిద్ధిపేట బ్యూరో,అక్టోబర్ 12 (సింగిడి): సిద్ధిపేట జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు అదే జిల్లాలో భాగమైన దుబ్బాక అభివృద్ధిపై కూడా ప్రజలకు సమాధానం చెప్పాలని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం రోజున అక్బర్పేట/భూంపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లా అభివృద్ధి గురించి మాట్లాడుతున్నప్పుడు గతంలో మంత్రిగా ఉండి దుబ్బాకకు జరిగిన అభివృద్ధి ఏమిటో కూడా వివరించాలని డిమాండ్ చేశారు. దుబ్బాక సిద్ధిపేట జిల్లాలో అంతర్భాగం కాదా? దుబ్బాక ప్రజలు ఈ జిల్లా పరిధిలోకి రారా? అని నిలదీశారు.పదేళ్ల జిల్లా ప్రస్థానంలో దుబ్బాకకు కల్పించిన మౌలిక సదుపాయాలు, యువతకు ఉపాధి అవకాశాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు, పూర్తిచేసిన అభివృద్ధి పనులపై స్పష్టమైన లెక్కలు వెల్లడించాలని కోరారు.దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం మాత్రమే కాదు.. దుబ్బాకకు చేసిన అభివృద్ధిని ప్రజల ముందు ఉంచాలన్నారు.సిద్ధిపేటతో పాటు దుబ్బాక అభివృద్ధికి ఇచ్చిన ప్రాధాన్యత ఏమిటో హరీశ్‌రావు స్పష్టం చేయాలనీ డిమాండ్ చేశారు.హరీష్ రావు చాలా సందర్భాల్లో దుబ్బాకనాకు ఒకకన్నుసిద్ధిపేటఒకకన్నుఅని చెప్పిసిద్ధిపేటకన్నుబాగుచేసిదుబ్బాకకన్నును నాశనం చేశారని తెలిపారు. అలాగే గతంలో మెదక్ పార్లమెంటు సభ్యులుగా ఉన్న కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాకను నష్టపరిచి దుబ్బాక కంటే ఎక్కువ నిధులు సిద్ధిపేటకు కేటాయించి నేడు సిద్ధిపేటలో జరుగుతున్న దశాబ్ది ఉత్సవాలకు ప్రజలను, నాయకులను తరలించడం సిగ్గుమాలిన చర్య అని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కూతురు కుమారస్వామి, కూడ వెల్లి డైరెక్టర్ వెలుపుల యాదగిరి ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్తే వెంకటేశం, భూంపల్లి భీంరావు, తిప్పనబోయిన స్వామి, బండి స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్



సిద్ధిపేట బ్యూరో,అక్టోబర్ 12 (సింగిడి): దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు ప్రయాణమయ్యే సమయంలో ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఆదివారం రోజున పత్రికా ప్రకటనలో తెలిపారు. పండుగ సెలవులను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలు, కాలనీలు, ఒంటరి ఇళ్ల పరిసరాల్లో పోలీస్ గస్తీ (పెట్రోలింగ్)ని మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. గతంలో నేరాలు నమోదైన సున్నిత ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వెల్లడించారు.ప్రయాణానికి వెళ్లే ముందు ఇళ్లకు బలమైన తాళాలు వేసుకోవాలన్నారు. ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి మరియు అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలనీ తెలిపారు. ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో సరిచూసుకోవాలనీ చెప్పారు. ప్రయాణ వివరాలు, ఊరికి వెళ్తున్న విషయాలను సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దన్నారు. ప్రయాణ సమయంలో వార్తాపత్రికలు, పాల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. ఇంటి గుమ్మం ముందు పేపర్లు, పాల ప్యాకెట్లు పేరుకుపోతే ఇల్లు ఖాళీగా ఉందనే విషయం దొంగలకు సులభంగా అర్థమవుతుందన్నారు. కాలనీలు లేదా గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 112 చేసి లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి అని సూచించారు. పండుగ సెలవులను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ పోలీసు శాఖకు సహకరించాలని ఆమె కోరారు.

ఆశా వర్కర్ల హక్కుల కోసం గొంతెత్తితే అరెస్టులపై మండిపాటు

- కొడంగల్‌లో అక్రమ అరెస్టులను ఖండించిన పరిగి బీఆర్ఎస్ నాయకులు



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 12 (సింగిడి): కొడంగల్‌లో ఆశా వర్కర్ల హక్కుల సాధన కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరవుతున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబు ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోషాలను కొడంగల్ పోలీసులు అరెస్టు చేసి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా వికారాబాద్ సీనియర్ నాయకుడు టైగర్ కృష్ణను కూడా ఈ సందర్భంగా అరెస్ట్ చేశారు. కేవలం ఆశా వర్కర్ల సమస్యలు, హక్కులపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నామని, ఎలాంటి ర్యాలీలు గానీ, ఆందోళన కార్యక్రమాలు గానీ నిర్వహించడం లేదని స్పష్టం చేసినప్పటికీ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం నిర్వహించుకోవడం కూడా తప్పేనా అంటూ వారు ప్రశ్నించారు. ఆశా వర్కర్ల హక్కుల కోసం మాట్లాడే నాయకులను అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం వారి గొంతును నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సింది పోయి, వారి తరఫున మాట్లాడే నాయకులను పోలీసులతో అణచివేయడం సరికాదని పేర్కొన్నారు. అరెస్టు చేసిన నాయకులకు సంఘీభావం తెలిపిన పరిగి బీఆర్ఎస్ నాయకులు ఈ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల అధ్యక్షులు ఆర్. ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు జాక్ రవికుమార్, మీదిగడ్డ శ్రీనివాస్, ఆంజనేయులు, శశాంక్‌రెడ్డి, నరేష్‌యాదవ్, లీగల్ సెల్ చైతన్య కిరణ్, తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఆశా వర్కర్ల హక్కుల కోసం పోరాడే గొంతుకలను అరెస్టులతో ఆపలేరు. కార్మికుల హక్కుల సాధనకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.

జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నిరంతరం కృషి

- చంద్రపురి కాలనీ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా రాహుల్ ఎన్నిక



జవహర్ నగర్, అక్టోబర్ 12 (సింగిడి): జవహర్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నిరంతరం కృషిచేస్తానని చంద్రపురి కాలనీ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్ కదం పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాహుల్ నియమితు లయ్యారు. చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారితో వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అర్హులకు అందే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా ఉండి రాబోయే రోజుల్లో పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపు కోసం ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు... అనంతరం నూతనంగా నియమితులైన రాహుల్ మాట్లాడుతూ నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం జవహర్ నగర్ లో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నయ్య కు డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తో పాటు సహకరించిన నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గడ్డం శ్రీనివాస్, ఏ బ్లాక్ అధ్యక్షులు మాట్ల శ్రీనివాస్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీడిప్యూటీ మేయర్‌రెడ్డి శెట్టిశ్రీనివాస్‌గుప్త, సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్, మాట్ల వినయ్ కుమార్, వెంకటేష్, నాయకం భాస్కర్, కాలేషా, సోమేశ్చారి, గణేష, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ

- 37వ వార్డులో యూజీడీ డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (సింగిడి): అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని 37వ వార్డులో కౌన్సిలర్ జలేందర్ ఆధ్వర్యంలో చేపట్టనున్న యూజీడీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) పనులను ఎమ్మెల్యే చింత ప్రభాకర్,సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనితలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి విషయంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వార్డుల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంగారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అయితే, ఆ నిధుల్లో కేవలం రూ. 22 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయని, మిగిలిన నిధులను ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. సంగారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం గతంలో మంజూరైన మిగిలిన నిధులను తిరిగి మంజూరు చేసి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణ ప్రజలకు అవసరమైన డ్రైనేజీ, రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, నాగరాజు గౌడ్, పల్లె సంజీవరావు, కౌన్సిలర్లు కొత్తపల్లి శ్రీకాంత్, దశరథ్‌రెడ్డి, జాఫర్, సురేష్, నాయికోటి నవీన్, శ్రీకాంత్, వార్డు సభ్యుడు జీవీ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లిలో దుర్గామాతను దర్శించుకున్న కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎన్ ఎస్ యు ఐ నాయకులు గోంగుల నవీన్ ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంను కుత్బుల్లాపూర్ నియోజక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి సందర్శించి మొదటి రోజు బాల త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు , సుఖసంతోషాలతో జీవించేలా అమ్మవారి ఆశీస్సులు అందజేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చీట్ల దివాకర్, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి కృపా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలి

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (సింగిడి): దేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా సీఎంసీ కొంపల్లి సర్కిల్ నార్త్ ఎన్సీఎల్ కాలనీ నోబుల్ పార్క్‌లో శృంగేరి జగద్గురువుల ఆశీస్సులతో అమ్మవారి ఉపాసకులు రాచర్ల రవిచంద్ర శర్మ ఆధ్వర్యంలో వారి స్వగృహం నందు నిర్వహించిన చతుషష్టి ఉపచార పూజ, విశేష కలశ స్థాపన పూజా కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు లు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శక్తీ స్వరూపిణీ అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం 13-10-2026

ఎడిటోరియల్

Editorial

బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన
ఇంటి నుంచే ప్రారంభం కావాలి

(13 అక్టోబరు "ప్రపంచ రొమ్ము క్యాన్సర్ దినం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా మహిళా లోకానికి రొమ్ము క్యాన్సర్ శాపంగా, ప్రాణాంతకంగా మారుతోంది. రొమ్ములో కణాజాలం నియంత్రణ లేకుండా పెరగడంతో ట్యూమర్లు లేదా గడ్డలు ఏర్పడి బ్రెస్ట్ క్యాన్సర్ రోగానికి దారి తీస్తుంది. 2022లో దాదాపు 2.3 మిలియన్ల ప్రపంచ మహిళల్లో రొమ్ము క్యాన్సర్ గుర్తించబడడం, 6.7 లక్షల మహిళలు ఆ ప్రమాదకర వ్యాధితో పోరాడి ప్రాణాలు వదలడం జరిగింది. పౌర సమాజంలోని తల్లులు, సోదరీమణులు, స్నేహితురాళ్లు, కూతుర్లు రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా పురుష సమాజం తగు జాగ్రత్తలు తీసుకుంటూ వారిలో వ్యాధి పట్ల అవగాహన పెంచాలి. వ్యాధి సోకిన మహిళలకు ఆత్మవిశ్వాసం, ధైర్యం నూరి పోయాలి. క్రమం తప్పకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలి. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెప్పాలి.

ప్రపంచ రొమ్ము క్యాన్సర్ దినం-2026:

అభివృద్ధి చెందిన దేశాల్లో రొమ్ము క్యాన్సర్ వ్యాధి నుంచి 90 శాతం, భారత్‌లో 66 శాతం, అల్పాదాయ దేశాల్లో 40 శాతం వరకు మహిళలు బయట పడడం జరుగుతోంది. వైద్య ఆరోగ్యశాఖలు ఇతర సంస్థల సమన్వయంతో రొమ్ము క్యాన్సర్ నుంచి మహిళలను రక్షించాలి. ప్రాణాంతకమైన రొమ్ము క్యాన్సర్ పట్ల అవసరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రతి ఏట 13 అక్టోబర్ రోజు "ప్రపంచ రొమ్ముక్యాన్సర్ దినం (వరల్డ్ బ్రెస్ట్ క్యాన్సర్ డే)" పాటించడం ఆనవాయితీగా మారిపోయింది. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన దినోత్సవం-2026 ఇతివృత్తంగా "ప్రతి కథ ప్రత్యేకమైనది, ప్రతి ప్రయాణం ముఖ్యమైనది" అనబడే అంశాన్ని తీసుకొని రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు చేయడం జరుగుతోంది. సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ, తొలి దశలో గుర్తించడం, సరైన వైద్యం చేయించుకోవడం వల్ల రొమ్ముక్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయడానికి అవకాశం ఉన్నది. రొమ్ము క్యాన్సర్ రోగ లక్షణాల్లో రొమ్ములో గడ్డలు ఏర్పడడాన్ని గుర్తించడం, రొమ్ము వాపు, రొమ్ము ఆకారం లేదా పరిమాణం మారడం, రొమ్ములోంచి రక్తం లాంటి ద్రవాలు కారడం, నిపుల్ లేదా తనుమొనలు మృదుత్వం మారడం లేదా నొప్పి రావడం లాంటివి అతి ముఖ్యమైనవని గమనించాలి. రొమ్ములో గడ్డలు ఏర్పడినట్లు గమనించిన మహిళలు వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి, చికిత్స ప్రారంభించాలి. రొమ్ము క్యాన్సర్ ప్రచారంలో పింక్ రిబ్బన్లు ధరించి అంకితభావంతో ప్రాణాలు కాపాడే అమూల్య సేవలు అందించాలి.

రొమ్ము క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా వైద్యులు సూచించిన జీవనశైలి మార్పులు తప్పనిసరిగా చేసుకోవాలి. శరీర బరువును అదుపులో పెట్టుకోవడం, పోషకాహారం తీసుకోవడం, రోజు వ్యాయామం చేయడం, దురలవాట్లకు దూరంగా ఉండడం, శిశువులకు తల్లులు రొమ్ముపాలు పట్టించడం, తరుచుగా పరీక్షలు చేయించుకోవడం, తొలి దశలో గుర్తించి పూర్తిగా నయం చేయించుకోవడం లాంటి అంశాలను మహిళలతో పాటు పురుష సమాజం కూడా తెలుసుకొని మన కుటుంబాల్లోకి రొమ్ము క్యాన్సర్ రాకుండా తగు జాగ్రత్తలతో అడ్డుకట్ట వేద్దాం. రొమ్ము క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోవడాన్ని తెలివిగా తప్పిద్దాం.

వందల రకాల క్యాన్సర్లలో రొమ్ము క్యాన్సర్ ముప్పు అధికంగా మారుతుంది. పేదరికంతో పోరాడుతున్న అభాగ్య మహిళల్లో ఇలాంటి ప్రాణాంతక వ్యాధి గురించి అవగాహన లేదు. ఈ పరిస్థితుల్లో కుటుంబ పెద్దలు తమదైన శైలిలో లేదా నిపుణులతో అవగాహన పెంచాలి. చేతులు కాలక ముందే ఆకులు సిద్ధం చేసుకోవాలి. వ్యాధి రాకుండానే జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధి వచ్చినా తొలి దశలోనే పరీక్షలు చేయించుకొని వైద్యాన్ని కొనసాగించాలి. వ్యాధి చికిత్స కన్న నివారణ మార్గాలే మిన్న అని నమ్మాలి.

కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

వైద్యవృత్తిలో తపస్సు చేసి
సిద్ధి పొందిన సదాశివరావు

నేడు కాసరనేని సదాశివరావ జయంతి

వైద్యవృత్తిలో నిరంతరం తపస్సు చేసి సిద్ధి పొందిన తాపసి కాసరనేని సదాశివరావు. తాను మాత్రమే తన సహదర్మ చారిణి, పుట్టిన మగ పిల్లలు ఐదుగురు వైద్యులు కావడం, వారి సంతానంలోనూ వైద్యవృత్తిలో స్థిరపడడం బట్టి ఆయనకు వైద్యవృత్తి పట్ల గల నిబద్ధత స్పష్టం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు శివారు రామచంద్ర పాలెం



(గారపాడు) గ్రామంలో భాగ్యమ్మ, రామ శాస్త్రులు దంపతులకు 1923 అక్టోబరు 13వ తేదిన డాక్టర్ కాసరనేని సదాశివరావు (1923 - 2012) జన్మించారు. మధ్యతరగతి రైతు కుటుంబం నుంచి వచ్చిన సదాశివరావు వైద్యవిద్య నభ్యసించి, శస్త్రవైద్య నిపుణులుగా పేరొందారు.

విశాఖపట్నం లో వైద్య విద్యను పూర్తి చేసి బెనారస్ విశ్వవిద్యాలయంలో గుండె మరియు శస్త్ర చికిత్సలు విభాగంలో స్నాతకోత్తర విద్య (పోస్ట్‌గ్రాడ్యుయేషన్) పూర్తిచేసి, గుంటూరు నగరంలో "పీపుల్స్ నర్సింగ్ హోమ్" అనే ప్రజా వైద్య శాలను స్థాపించారు.దాదాపు అర్ధ శతాబ్దం పాటు వైద్యవృత్తిలో కొనసాగారు. ఆయన భార్య జయప్రదాంబ, అలాగే, వారి సంతానం మరియు మనవళ్లు, మనవరాళ్లు కూడా వైద్య రంగంలో స్థిరపడడం విశేషం. సదాశివరావు పేద ప్రజల పట్ల ఉదారంగా వ్యవహరించేవారు. వృత్తిలో మానవత్వాన్ని, వృత్తి విలువలను తు.చ. తప్పక పాటిస్తూ, మంచి హస్తవాసిగల డాక్టరుగా పేరు తెచ్చుకున్నారు.

ఆయన నిర్వహించిన అనేక శస్త్ర చికిత్సలు విజయవంతం కావడంతో ఆయన హస్తవాసి మంచిదని పేరొచ్చింది, ఆయన చేతులతో ఆసుపత్రులు ప్రారంభించడం మంచిదని భావించిన ఆసుపత్రుల నిర్వాహకులు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలో సుమారుగా 800 ఆసుపత్రులను ఆయన చేత ప్రారంభింప చేయడం విశేషం.

సదాశివరావు విద్యాభ్యాస సమయంలో కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ప్రభావితులై కమ్యూనిస్టు ఉద్యమానికి సానుభూతి పరులుగా వుండేవారు. తరువాత కాలంలో పార్టీకి దూరంగా ఉన్నారు. సోషలిస్టు పార్టీలో క్రియాశీలక నాయకులు సన్నిహితుడైన అప్పటి ఎంపి గా ఉన్న జాగర్లమూడి చంద్రమౌళి ప్రోద్బలంతో పార్టీలో చేరారు. 1977,1980ల లో జనతాపార్టీ, లోక్ దళ్ పార్టీల అభ్యర్థిగా గుంటూరు లోక్ సభకు పోటీ చేసి పరాజయం పాలయ్యారు. 1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించిన తరువాత నందమూరి ఆహ్వానం మేరకు (ఎన్టీఆర్, సదాశివ రావు గుంటూరు ఏ.సి.కళాశాలలో చదువుకున్నారు. మంచి స్నేహితులు కూడా వారి అనుబంధం ఎన్టీఆర్ మరణం వరకు కొనసాగింది) పార్టీలో చేరి 1983 నుంచి 1985 వరకు పార్టీ వైద్య విభాగంలో పని చేశారు. 1985లో ఎన్టీఆర్ ప్రోద్బలంతో పెదకూరపాడు స్థానం నుంచి పోటీ చేసి శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి కోటేశ్వరరావు కు "వైద్య విధాన పరిషత్" రూపకల్పనలో మార్గదర్శకాలు చేశారు.

సదాశివరావు గొప్ప విద్యాదాత , ఎంతో మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇప్పించి వారి విద్యకు ఆర్థిక చేయూత ఇచ్చారు. అలాగే 1967లో తన స్నేహితుడు జాగర్లమూడి చంద్రమౌళి , ప్రముఖ విద్యావేత్త గోగినేని కనకయ్య మరి కొందరు ప్రముఖులతో కలిసి " నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ" ని స్థాపించారు (ఈ సంస్థ కింద ప్రముఖ జేకేసీ కళాశాల, ఆర్.వి.ఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల, చలపతి కళాశాలు ఇలా అనేక ఇంటర్మీడియట్ కళాశాలు , పాఠశాలలు నడుస్తున్నాయి). సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శిగా, 1978 నుంచి 2002 వరకు అధ్యక్షుడు గా పనిచేశారు. తన అర్ధాంగి పేరు మీద " జయప్రద డిగ్రీ కళాశాల" ను స్థాపించి సొసైటీ కి ఇచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, గుంటూరు మెడికల్ కళాశాలల సెనెట్ సభ్యులు గా పనిచేశారు.

సదాశివరావు కళాపోషకులు కూడా. వైద్య వృత్తిలో తీరిక లేకుండా ఉన్నా, తన ఆసక్తితో సాహిత్య పోషణను కొనసాగించారు. " సాహితీ సదస్సు" పేరిట గుంటూరు నగరం లో సాహిత్య వేదిక ను ఏర్పాటు చేసి , వేదిక ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కవులను, రచయితలను , తాత్వికవేత్తలను ఆహ్వానించి వారిని సన్మానించారు. మానవత, సాహితీ ప్రియత్వం మేళవించి ఆయన రచించిన ఆత్మకథ " సదా శివమ్" పుస్తకం సాహిత్య ప్రియుల్లో మంచి ఆదరణ లభించింది. భారత స్వాతంత్ర్యానికి పూర్వమున్న పరిస్థితుల్ని నేటి పరిస్థితుల్ని తులనాత్మకంగా వివరించే ఈ గ్రంథం చదవడానికి ఆసక్తిగానూ, ఒక మంచిమనిషి జీవితాన్ని గురించి చెప్పేదిగానూ ఉంటుంది.

డాక్టర్ జయప్రదాంబ, సదాశివరావు దంపతులకు ఐదుగురు సంతానం కలగగా, ఐదుగురూ డాక్టర్లే కావడం విశేషం. భార్య మరణానంతరం ఆమె పేరు మీద గుంటూరులో మహిళా డిగ్రీ కళాశాలను స్థాపించారు కూడా. డాక్టర్ సదాశివరావు 2012 సెప్టెంబర్ 30 న గుంటూరులో మరణించారు. భారత తపాలశాఖ గుంటూరులో 2019 డిసెంబరు 14న డాక్టర్. కాసారనేని సదాశివరావుపై ఒక ప్రత్యేక తపాలా కవరు విడుదల చేసారు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494



బహుముఖ ప్రజ్ఞాశాలి నంజుండయ్య

నేడు హెచ్ వి నంజుండయ్య జయంతి

ఆయన మైసూర్ విశ్వ విద్యాలయం వ్యవస్థాపకుడు, తొట్టతొలి ఉపకులపతి కూడా. దేశ విదేశాల్లో కీర్తి గడించిన ప్రముఖ విద్యావేత్త దివంగత దేశ మలి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల నుండి మైసూరు విశ్వ విద్యాలయానికి పిలిపించి, ఆయనతో కలసి పని చేసి అత్యంత సన్నిహితంగా మెదిలిన వ్యక్తి. మైసూర్ దీవాన్ గా, మైసూరు రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయాధిపతిగా విధులు నిర్వర్తించి, న్యాయ సంబంధ బహు గ్రంథ కర్తగా గుర్తింపు పొందిన మేధావి.

ప్రపంచం లోని మానవజాతి శాస్త్రవేత్తలలో మొదటి తరానికి చెందిన ప్రముఖునిగా పేరొంది, మైసూరు జాతులు, కులాలపై 1906లో ప్రభావ శీలమైన గ్రంథాన్ని రచించాడు. కన్నడ సాహిత్య సమ్మేళనం వ్యవస్థాపక అధ్యక్షుడై, బెంగళూరు, మైసూరులలో జరిగిన కన్నడ సాహిత్య సమ్మేళనాలకు కొంత కాలం పాటు అధ్యక్షత వహించాడు. మాతృభాష తెలుగు అయినా కన్నడ భాష పట్ల మక్కువతో ఆ భాషకు ఎనలేని సేవలు అందించాడు. ఆయనే హెచ్ వి నంజుండయ్యగా పిలువ బడే హెబ్బళలు వేల్పనూర్ నంజుండయ్య.

1860 అక్టోబర్13వ తేదీన మైసూరులో సుబ్బయ్య, అన్న పూర్ణమ్మ దంపతులకు ఒక బీద కుటుంబంలో నంజుండయ్య జన్మించాడు. మైసూరు మహా రాజు ద్వారా విద్యార్థి ఉపకార వేతనం పొంది మైసూరులోని వెస్లియన్ హైస్కూలు, మద్రాసు లోని మద్రాసు క్రిస్టియన్ కళాశాలలలో చదివి 1880లో బి.ఎ., తరువాత బి.ఎల్. 1893లో ఎం.ఎల్.పట్టాలు పుచ్చు కున్నాడు. 1885లో నంజనగూడులో మున్సిఫ్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ఆరంభించాడు. తర్వాత హసన్‌లో అసిస్టెంట్ కమీషనర్, బెంగుళూరులో సబ్ జడ్జి, శివ మొగ్గ జిల్లా కలెక్టర్, మైసూరు రాజ్య ముఖ్య కార్యదర్శి, ఛీఫ్ జస్టీస్ వంటి వివిధ పదవులను చేపట్టాడు.

1916లో మైసూరు విశ్వ విద్యాలయం ప్రారంభ మైనప్పుడు దానికి మొదటి ఉపకులపతిగా నియమించ బడి 1920లో మరణించేవరకు ఆ పదవిలో





కొనసాగాడు. మృతి చెందిన తన కుమారుని స్మృత్యర్థం విక్టర్ హ్యూగో వ్రాసిన ఫ్రెంచి కవితలను "టియర్స్ ఇన్ ద డార్క్" అనే పేరుతో ఆంగ్లం లోనికి అనువదించాడు.

ఆయన అనేక సామాజిక కార్యక్రమాలలో పాల్గొన్నాడు. వితంతువుల కోసం "విడోస్ హోమ్" ను స్థాపించాడు. హరిజనోద్ధరణ కొరకు సెంట్రల్ బోర్డింగ్ స్కూలు, హాస్టలు, కుటీర పరిశ్రమ స్థాపించాడు. స్త్రీ విద్య గురించి ప్రచారం చేశాడు. పల్లెపల్లెలో తిరిగి విద్యా వసతులలోని కొఱతను గుర్తించి జాతీయ విద్యా విధానానికి పిలుపు నిచ్చాడు.

నంజుండయ్య మాతృభాష తెలుగు అయినా కన్నడ భాష పట్ల ఎక్కువ మక్కువ కలిగి, కన్నడ సాహిత్య పరిషత్తును స్థాపించి దాని ద్వారా కన్నడ పుస్తకాల ప్రచురణ, సాహిత్య సదస్సుల నిర్వహణ, పరిశోధ నలకు ప్రోత్సాహము, కన్నడ సాహిత్య సమ్మేళనాల నిర్వహణ తదితర కార్యక్రమా లు చేపట్టాడు. ఆయన్ను కన్నడ సాహిత్య సమ్మేళనాలకు మొదటి మూడు సంవత్స రాలకు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బహుభాషావేత్తగా అనేక గ్రంథాలను రచించాడు. కన్నడ భాషలో వ్యవహార దీపిక, వ్యవహార ధర్మశాస్త్ర, అర్థశాస్త్ర, లేఖ్యబోధిని, రాత్రియల్లి కంబని, ఆంగ్లభాషలో మైసూర్ ట్రైబ్స్ అండ్ కాస్ట్స్, టియర్స్ ఇన్ ద నైట్ (విక్టర్ హ్యూగో ఫ్రెంచి రచనకు ఆంగ్లానువాదం) మొదలైనవి ఆయన ముఖ్య రచనలు.

మైసూరు మహారాజుకు రాజకీయ, పరిపాలనా సలహా దారుగా ఉండి, క్లిష్ట సమయం లో మైసూరు దివాన్‌గా కూడా పనిచేశాడు. అలా మైసూరు మహారాజు నంజుండయ్యకు "రాజమంత్ర ప్రవీణ" అనే బిరుదును ప్రదానం చేశారు. 1911లో ఢిల్లీలో చక్రవర్తి పట్టాభిషేక మహోత్సవానికి అతిథిగా ఆహ్వానించ బడ్డాడు. 1915లో బ్రిటిష్ ప్రభువు 5వ కింగ్ జార్జ్ ఆయనను "కంపాని యన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్" బిరుదుతో సత్కరించాడు.

బెంగళూరులోని మల్లేశ్వరం ప్రాంతంలో తన తొలి నివాస మైన తన భవనాన్ని బాలికల ఉన్నత పాఠశాల కోసం ప్రభుత్వానికి దానం చేశాడు. నేటికీ మల్లేశ్వరం 4వ మెయిన్, 13వ క్రాస్‌లోని ఆ భవనంలో బాలికల హైస్కూలు నడుప బడుతూ ఉంది. ఆయన కుటుంబీకులు ప్రస్తుతం సదరు భవనం సమీపంలోనే నివసిస్తు న్నారు. ఆయన1920, మే 7వ తేదీన మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు చిరునామా
బతుకమ్మ

ప్రపంచంలో ప్రతి దైవాన్ని పూలతో పూజిస్తే
ఆ పూలనే దైవంగా పూజించే అరుదైన పూర్వం

బొడ్డెమ్మ తో మొదలైన తొమ్మిది రోజుల ఆనవాయితీ
తీరొక్క పూలతో అందంగా అలంకరించే రూపం

పసుపు ముద్దను గౌరమ్మ గా కొలిచే ఘనతకు నిదర్శనం
ఆడపడచులు ముద్దుగా మురిసిపోయే తనివితీరని క్షేత్రం

సృష్టిలో ప్రకృతి సైతం పరవశించి సహకరించే వైనం
కాలానికి అనుగుణంగా పూసేపూల విశిష్టతకు ప్రతిరూపం

బతుకునిచ్చే బతుకమ్మ గా భావించే ఆత్మవిశ్వాసం
రంగరంగా వైభవంగా జరుపుకునే ఔన్నత్యం

సబాండవర్గాలుసంతోషంతో మురిసిపోయే కళ
ఆడబిడ్డలంతా అమ్మను చేరే ఆనందాల కళ

అమ్మాయిల అందమైన అలంకరణలు
వినసొంపైన పాటలతో పరవశించే తీరు

నీటి ప్రవాహం లోతెలియాడే పూల పడవలా
చెరువుల,కుంటల నిండా అలుకున్నా పరిమాళాలా లత

స్వీయ రాష్ట్రంలో రాష్ట్ర పండుగగా అవతరించిన చరిత్ర
స్వరాష్ట్ర సాధనలో అందరిని కలిపిన సంఘటితపు వేదుక

పల్లెపల్లెనా ప్రజలంతా ఆనందంగా జరుపుకునే గొప్ప పండుగ
ప్రపంచం నలుదిక్కులా చాటే మన తెలంగాణ అస్థిత్వపు బాట

వంశీకృష్ణ గౌడ్.బండి
రంగయ్యపల్లి, రేగొండ
జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9550837962



బాధితులకు భరోసా.. ఆర్జీలకు పరిష్కారం

• కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, అక్టోబరు 12 (సింగిడి): ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన కీలకం. ప్రజావాణిలో అందే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 47 దరఖాస్తులను స్వీకరించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలు ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రతిబింబించాయి. మంచిర్యాల పట్టణంలోని ఆర్కా బేకరీలో పనిచేస్తున్న ఉద్యోగులు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించాలని కోరారు. కాసిపేట మండలం కొత్తహరిపేటకు చెందిన భానోత్ దేశాయ్ తన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కోటపల్లి మండలం మల్లంపేటలో గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కొండ్ర సుదర్శన్ కోరారు. వేమనపల్లి మండలం సంపుటం గ్రామానికి చెందిన రైతులు నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించి సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. చెన్నూర్‌లోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఉపాధి కల్పించాలని దుగ్నేపల్లికి చెందిన ఆతుకూరి సుప్రజ దరఖాస్తు సమర్పించారు. మంచిర్యాల పట్టణంలో పోచమ్మ చెరువు నుంచి వచ్చే వరద కాలువకు సంబంధించిన భూ ఆక్రమణలను తొలగించాలని అబ్దుల్ సత్తార్ కోరారు.

పరిష్కారమే లక్ష్యం కావాలి

ప్రజావాణిలో అర్జీలు స్వీకరించడంతోనే బాధ్యత ముగియదని, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు ప్రజలకు ఉపశమనం కలిగించేలా ఉండాలని అధికారయంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వేతనాల బకాయిలు, భూ సమస్యలు, గ్రామపంచాయతీ నిధుల వినియోగం, సాగునీటి ఇబ్బందులు, ఉపాధి వంటి అంశాలపై వచ్చిన వినతులను సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలి. సమస్యల స్వభావాన్ని బట్టి పరిష్కార మార్గాలను అన్వేషించి, అర్జీదారులకు తగిన సమాచారం అందించడం ద్వారా ప్రజావాణిపై విశ్వాసాన్ని మరింత పెంచవచ్చు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అధికారుల సమన్వయంతో పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

వెట్టి చాకిరీ నిర్మూలనకు స్వేచ్ఛా రథం...

వెట్టి చాకిరీ, బలవంతపు శ్రమ వంటి దురాచారాల నిర్మూలనతోపాటు కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'స్వేచ్ఛా రథం' వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి క్రాంతి కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ పాల్గొన్నారు. వెట్టి చాకిరీ బాధితులకు న్యాయం జరిగేలా అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన సహాయ సేవలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. బాండెడ్ లేబర్ హెల్ప్‌లైన్ 080-6943434 గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, భూగర్భ గనులు, క్వారీయింగ్, వ్యవసాయ రంగాల్లో పనిచేసే కార్మికులకు హక్కులపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

దసరా వేళా.. లాభాల వాటా ఏది



మంచిర్యాల, అక్టోబర్ 12 (సింగిడి): సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, దసరా పండుగ సమీపిస్తున్నా లాభాల వాటాను ప్రకటించకపోవడం విచారకరమని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 14న గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఆర్కే-7 గనిలో నిర్వహించిన బాయా బాట కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కార్మికులతో మాట్లాడారు. సింగరేణిలో అనేక సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికులు కష్టపడి బొగ్గు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, వారికి అందాల్సిన ప్రయోజనాల విషయంలో జాప్యం జరగడం అందోళన కలిగిస్తోందని అన్నారు. దసరా సమీపి స్తున్నా లాభాల వాటాపై ప్రకటన వెలువడకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు.

కార్మికుల సమస్యలపై గర్జన

సింగరేణి కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్మిక గర్జనకు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. అక్టోబరు 14న గోదావరిఖనిలో జరిగే ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్మికులంతా ఐక్యంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ పెట్టెం లక్ష్మణ్, ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, సెంట్రల్ జాయింట్ సెక్రటరీలు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, ఏరియా కార్యదర్శులు గొర్ల సంతోష్, తొంగల రమేష్, బిరుదు శ్రీనివాస్, పిట్ సెక్రటరీ రాజు నాయక్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ పాదం శ్రీనివాస్, షిఫ్ట్ సెక్రటరీలు గురుమూర్తి శ్రీధర్, అజిత్‌రావు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పేకాటపై పోలీసుల పంజా



మంచిర్యాల, అక్టోబరు 12 (సింగిడి): జిల్లాలో అక్రమ కార్యకలాపాలపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్, సీసీసీ నస్పూర్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ ఘటనలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో అక్రమ, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏఎస్ఆర్ నగర్‌లో డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కలాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ నార్కోటిక్ టీమ్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నేతృత్వంలో ఎస్ఐలు దీకొండ రమేష్, లచ్చన్న, సీసీసీ నస్పూర్ ఎస్ఐ తైసీనుద్దీన్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నారు. దాడిలో 52 పేకముక్కలు, రూ. 15,300 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో సీసీసీ నస్పూర్ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన వారితోపాటు చెన్నూరు, శ్రీరాంపూర్ ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. వీరిలో డ్రైవర్లు, వ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పట్టుబడిన ఎనిమిది మందిని, స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ అధికారులు సూచించారు. జూదానికి దూరంగా ఉండాలి: అక్రమ జూదం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో జూదం లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

దుర్గామాత మండపాల్లో డిప్యూటీ మేయర్ సునీల్‌రావు పూజలు

భగత్‌నగర్‌లో పలు మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు



కరీంనగర్, అక్టోబర్12(సింగిడి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని భగత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు సోమవారం దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, చైతన్య యువజన సంఘం, ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఆదాయవృద్ధికి చర్యలు



కరీంనగర్, అక్టోబర్12(సింగిడి): నగరపాలక సంస్థల ఆదాయ వృద్ధి, మున్సిపల్ బాండ్ల జారీ, ఆర్థిక సంస్కరణలపై సోమవారం నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశంలో అధికారులు చర్చించారు. హైదరాబాద్‌లోని మున్సిపల్ పరిపాలన సంచాలకుల కార్యాలయం నుంచి సీడీఎంఏ అధికారి శ్రీదేవి, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో కలిసి రాష్ట్ర మున్సిపల్ అధికారులతో సమావేశమయ్యారు. కరీంనగర్ నగరపాలక సంస్థ నుంచి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కమిషనర్ ఆయాజ్, సంయుక్త శాఖాల అధికారి లక్ష్మీరాజం, ఇతర అధికారులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఆదాయ వనరుల పెంపు, నిధుల సమీకరణ, వార్షిక లెక్కల నిర్వహణ, ఆర్థిక తనిఖీలపై చర్చించారు. ప్రపంచ బ్యాంకు మార్గదర్శకాలకు అనుగుణంగా నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు, ఆర్థిక సంస్కరణలను సమర్థంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. బాండ్ల జారీలో నిబంధనలు పాటించాలని, లెక్కల నిర్వహణ, తనిఖీలను వేగవంతం చేసి పారదర్శకతకు ప్రాధాన్యమివ్వాలని సీడీఎంఏ అధికారి శ్రీదేవి సూచించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి...

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులతో సీపీ రష్మీ పెరుమాళ్



సిద్దిపేట, అక్టోబర్, 12 (సింగిడి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ.రష్మి పెరుమాళ్, పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను, సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సీపీ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ... తన స్వంత అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు.తనకు అనుమానాస్పద ఫోన్ వచ్చిందని, ముఖ్యమైన పార్శిల్ డెలివరీ చేయాల్సి ఉందని చెప్పి, షేర్ చేసిన నంబర్‌కు వచ్చిన పిన్ లేదా ఓటీపీ కోరారని తెలిపారు. ఏదైనా వస్తువును ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసినప్పుడు, అది డెలివరీ అవుతుందనే ఆలోచనలో ఉన్నప్పుడు లేదా పనుల్లో బిజీగా ఉన్నప్పుడు ఇలాంటి కాల్స్ వస్తే, అజాగ్రత్త వహించి పిన్ లేదా ఓటీపీ తెలియని వ్యక్తులకు తెలుపవద్దని సూచించారు. పొరపాటున ఫోన్ ఎత్తిన సంభాషణ ఎక్కువసేపు పొడిగించవద్దనీ మీ బ్యాంక్ ఖాతాలకు బలమైన కోడ్ లను నియమించుకోవాలని వాటిని ప్రతి కొన్ని నెలలకొకసారి క్రమం తప్పకుండా మారుస్తూ ఉండలని ఈ నెల సైబర్ నేరాల మాసం థీమ్ కూడా ఇదే అంశంపై ఆధారపడి ఉంది అని తెలిపారు. ఎటువంటి లింక్ వచ్చినా, ఒక క్షణం ఆగి అది దేని గురించో ఆలోచించిన తర్వాతే తదుపరి చర్య తీసుకోవాలి. చిన్న చిన్న జాగ్రత్తల ద్వారా మిమ్మల్ని, మీ కుటుంబాన్ని భారీ ఆర్థిక నష్టాల నుండి కాపాడుకోవచ్చు అని సూచించారు. ఈ తరహా అవగాహనను మీ బంధువులు, స్నేహితులు, ఇతువులకు కూడా చేరవేయాలని కోరారు.

కుటుంబంలో చిన్న పిల్లలు, యువకులు పెద్దల మొబైల్స్ వాడుతూ తెలియని లింక్స్ క్లిక్ చేయడం, సురక్షితం కాదని ఆన్‌లైన్ గేములు ఉపయోగించడం వంటివి గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రజల ప్రదేశాలలో లేదా ప్లాట్‌ఫారమ్‌లలో వై-ఫై ఉపయోగించడం వల్ల మొబైల్ ఫోన్లు సైబర్ దాడికి గురై క్షణాల్లో హ్యాక్ అయ్యే అవకాశం ఉంటుందని మన మొబైల్ ఫోన్లన్నీ ఆధార్ కార్డుకు, ఆధార్ కార్డు బ్యాంక్ ఖాతాలకు అనుమతించబడి ఉంటాయని కాబట్టి సైబర్ హ్యాకర్లకు మన ఖాతా వివరాలు పబ్లిక్ కావడానికి కేవలం కొన్ని నిమిషాలు మాత్రమే పడుతుందని సైబర్ నేరాల పట్ల అవగాహతో ఉండి అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. సామాజిక మాధ్యమాలను వాడుతున్న ప్పుడు మీ నివాస ప్రాంతం, కార్యకలాపాల వివరాలను ఎక్కువగా పోస్ట్ చేయవద్దు. ప్రొఫైల్స్‌ను వీలైనంత వరకు ప్రైవేట్‌గా ఉంచుకోవాలి. వాట్సాప్ స్టేటస్‌లలో మీ కచ్చితమైన అడ్రస్, మీరు ఎప్పుడు, ఎక్కడికి ప్రయాణిస్తున్నారు అనే వివరాలు షేర్ చేయకపోవడం ద్వారా మీ గైర్హాజరీలో జరిగే భౌతిక నేరాలను నివారించవచ్చు. సైబర్ నేరాల బారిన పడినప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా ఎషఎష.ఎఎవతీ-ఎతీఅఎవ.స్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు తక్షణమే స్పందించి సమాచారం అందిస్తే మోసపోయిన మొత్తాన్ని రికవరీ చేయడానికి సహాయపడుతుందని తెలిపారు.

సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయం కూల్చివేతపై పౌర హక్కుల సంఘం ఆగ్రహం

కార్మిక సంఘాల హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదు
సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నక్క నారాయణరావు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, అక్టోబర్ 12 (సింగిడి): భూపాలపల్లిలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయ ప్రహరీ గోడ కూల్చివేత ఘటనపై తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల కార్యాలయాల విషయంలో కక్షపూరిత చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భూపాలపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేసే సంఘాల కార్యకలాపాలకు ఆటంకం కలిగించే చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. కార్మిక సంఘాలకు చట్టబద్ధంగా తమ కార్యకలాపాలు నిర్వహించుకునే స్వేచ్ఛ, హక్కులు ఉన్నాయని, వాటికి భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ కొమురయ్య గౌడ్ తమ బాధ్యతను స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యాలయ ప్రహరీ గోడ కూల్చివేతకు సంబంధించిన అనుమతులు, వివిధానాలు పాటించారా లేదా అనే అంశాలపై అధికారులు విచారణ జరపాలని కోరారు. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించకుండా కూల్చివేత జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సింగరేణి కార్మికులు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి హక్కులను పరిరక్షించడం ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్మిక సంఘాల స్వేచ్ఛను దెబ్బతీసే చర్యలను పౌర హక్కుల సంఘం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

సమగ్ర విచారణకు డిమాండ్

సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయ ప్రహరీ గోడ కూల్చివేతపై సమగ్ర విచారణ జరిపించాలని, కూల్చివేతకు సంబంధించి చట్టబద్ధమైన అనుమతులు, విధివిధానాలను పరిశీలించాలని వారు కోరారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, సంఘానికి జరిగిన నష్టంపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కార్మిక సంఘాల హక్కులకు భంగం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాని, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకుడు రాదండి దేవేందర్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరేటి రాజన్న, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్, అసంఘటిత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఐత బాబు, పార్వతక్క, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు దాసరి జనార్ధన్, జైపాల్ సింగ్, గోడిసెల శ్రీహరి, నామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రతిష్టత దెబ్బతీసేందుకు ప్రతిపక్షాల కుట్ర

కేంద్ర ఫిలిం బోర్డు సభ్యులు రాపాక ప్రవీణ్



మానకొండూర్, అక్టోబర్12(సింగిడి): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర ఫిలిం బోర్డ్ సభ్యులు,లక్ష్మీపూర్ ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్ మాట్లాడుతూ దేశ ప్రతిష్టతను దెబ్బతీసేందుకు కాంగ్రెస్, ఆప్, కాక్రోజ్ పార్టీలు పనిచేస్తున్నాయని అన్నారు. నరేంద్ర మోడీ కి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక రాహుల్ గాంధీ ఓటు చోరీ అనే అబద్ధము అంశాన్ని తీసుకొచ్చారని అన్నారు. దేశంలో 95 కోట్ల మంది ఓటర్లు ఉంటే ఇప్పటికే 82 కోట్ల మంది ఓటర్లుగా 88 శాతం మంది నమోదు అయ్యారని అన్నారు. ఇంకా నమోదు చేసుకునే అవకాశం కూడా ఉందని తెలియజేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ గతంలో ఈ దేశంలో 8 సార్లు నిర్వహించారు అని అత్యధికంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడే 07 సార్లు ఎస్. ఐ. ఆర్ ప్రక్రియ నిర్వహించారు అని అన్నారు. ఎస్. ఐ. ఆర్ ప్రక్రియ ను ప్రతిపక్ష నాయకులు సచిన్ పైలెట్, శశితరుర్ వంటి నేతలు ఎస్. ఐ. ఆర్ వల్లనే బోగస్ ఓట్లు తొలగిపోయాయని కొనియాడారని గుర్తు చేశారు. స్థానిక కాంగ్రెస్ నేతలు ఎస్. ఐ. ఆర్ ప్రక్రియ జరిగేటప్పుడు పోలింగ్ బూత్ లలో దరఖాస్తు ఫారం లో నింపుతూ ప్రతి వారంలో సమావేశానికి హాజరైనారని ఏ గ్రామంలో ఎన్ని ఓట్లు తీసివేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రను ప్రజలందరూ గమనిస్తున్నారని దేశంలో మరోసారి నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వమే వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు రావుల శంకరాచారి, జిల్లాల రాజమౌళి, ఓవిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మియాపూరం లక్ష్మణ చారి, మండల ప్రధాన కార్యదర్శులు భాషబోయిన ప్రదీప్ యాదవ్, శీలం కుమార్, పోచంపల్లి సర్పంచ్ అంబటి స్వామి, దెవంపల్లి ఉప సర్పంచ్ దాడి కార్తీక్,మాజీ మండల ప్రధాన కార్యదర్శిలు వంగళ ఆంజనేయులు, కత్తి ప్రభాకర్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు పోచంపల్లి శ్రీనివాస్, మర్రి ఆంజనేయులు, సీనియర్ నాయకులు గాడిచెర్ల భూమయ్య, మార్కొండ రమేష్ పటేల్ ,మాచర్ల కోటేశ్వర్, మండల కార్యదర్శులు నందగిరి బలరాం, ఆరేపల్లి సునంద్ కుమార్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అడప రవి, బీజేవైఎం జిల్లా నాయకులు తాడూరి కిరణ్ రెడ్డి, మడ్డీ రాకేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు కొండ్ర వరప్రసాద్, కాల్వ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

• సిద్దిపేట రూరల్‌సీఐ విద్య సాగర్



సిద్దిపేట రూరల్, అక్టోబర్, 12 సింగిడి: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు ప్రయాణమయ్యే సమయంలో ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిద్దిపేట రూరల్ సీఐ విద్య సాగర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగ సెలవులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, కాలనీలు, ఒంటరి ఇళ్ల పరిసరాల్లో పోలీస్ గస్తీ (పెట్రోలింగ్)ని మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. గతంలో నేరాలు నమోదైన సున్నితమైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వెల్లడించారు.

రూరల్ ప్రజలకు ముఖ్యమైన సూచనలు:

ప్రయాణానికి వెళ్లే ముందు ఇళ్లకు బలమైన తాళాలు వేసుకోవాలని ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి మరియు అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో సరిచూసుకోవాలనీ కోరారు. ప్రయాణ వివరాలు, ఊరికి వెళ్తున్న విషయాలను సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దనీ ప్రయాణ సమయంలో వార్తాపత్రికలు, పాల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలనీ ఇంటి గుమ్మం ముందు పేపర్లు, పాల ప్యాకెట్లు పేరుకుపోతే ఇల్లు ఖాళీగా ఉందనే విషయం దొంగలకు సులభంగా అర్థమవుతుందనీ కాలనీలు లేదా గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 112 చేసి లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలనీ సీఐ సూచించారు.

ప్రజా భద్రతే మన అందరి ఉమ్మడి బాధ్యత ప్రజల సహకారంతోనే సురక్షిత సమాజం సాధ్యం

పండుగ సెలవులను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ పోలీసు శాఖకు సహకరించాలని సిద్దిపేట రూరల్ సీఐ విద్య సాగర్ కోరారు.

కాంగ్రెస్ వాణిజ్య సెల్ జిల్లా పగ్గాలు తాటిపల్లి రాజన్నకు

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా నియామక పత్రం అందజేత



జమ్మికుంట, అక్టోబర్ 12 (సింగిడి): హుజూరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు, శ్రీ ముక్తేశ్వర స్వామి ఆలయ డైరెక్టర్ తాటిపల్లి రాజన్న కాంగ్రెస్ జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం రాజన్నకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజన్నను ఆర్యవైశ్య మండల కమలాపూర్ అధ్యక్షుడు కంభంపాటి ప్రసాద్, హుజూరాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ తాళ్లపల్లి రమేష్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ, గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన తన సేవలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీ ముక్తేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తగా అవకాశం కల్పించిందన్నారు. తాజాగా జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని, వ్యాపార, వాణిజ్య సంస్థలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ వ్యాపారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని రాజన్న వెల్లడించారు.

ఢిల్లీలో నిరసనలో మంచిర్యాల ఎమ్మెల్యే



మంచిర్యాల, అక్టోబరు 12 (సింగిడి): ఎన్నికల సంఘం వ్యవహారశైలిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేపట్టింది. ఏఐసీసీ పిలుపు మేరకు కేంద్ర ప్రధా

సింగరేణి పరిరక్షణ సభను విజయవంతం చేయండి



- ఈనెల 14న రామగుండంలో కేటీఆర్ సభ
- కరీంనగర్ నుంచి 300 కార్లతో ర్యాలీ
- మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, అక్టోబర్12(సింగిడి): సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం ఈనెల 14న రామగుండంలో నిర్వహించనున్న సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సభ సన్నాహాల్లో భాగంగా తన నివాసంలో జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సింగరేణి సంస్థ తెలంగాణతోపాటు దేశానికి కీలకమని, దాని ప్రయోజనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గంగుల పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని, సంస్థలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సింగరేణి సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి, సంస్థ పరిరక్షణపై అవగాహన కల్పించడమే సభ ఉద్దేశమని తెలిపారు.

300 కార్లతో ర్యాలీ...

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొనే సభకు కరీంనగర్ నుంచి సుమారు 250 నుంచి 300 కార్లతో ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించారు. కేటీఆర్ మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్య కరీంనగర్‌కు చేరుకోనున్న నేపథ్యంలో ఆయనతో కలిసి రామగుండానికి తరలివెళ్లనున్నారు. పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు తమ వాహనాలతో కరీంనగర్‌కు చేరుకోవాలని గంగుల కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా అధ్యక్షుడు జీబీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, అనిల్‌కుమార్ గౌడ్, కాల్వ మల్లేశం, జములుద్దీన్, నాంపల్లి శ్రీనివాస్, కర్ర సూర్యశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ భక్తులకు మేయర్ కానుక

- మాటకు కట్టుబడి... వసతి కల్పించి



మంచిర్యాల, అక్టోబరు 12 (సింగిడి): ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడమే ప్రజాప్రతినిధుల బాధ్యత. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను ఆచరణలో పెట్టినప్పుడే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ఈ దిశగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్ రాంనగర్‌లో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన రెస్ట్ హాల్ షెడ్ అందుబాటులోకి వచ్చింది. శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్మించిన ఈ షెడ్‌ను మేయర్ ధర్ని మధుకర్ దంపతులు, కార్పొరేటర్ ఎంబాడి కుమారస్వామితో కలిసి ప్రారంభించారు. దేవాలయాలకు వచ్చే భక్తుల్లో వృద్ధులు, మహిళలు ఎక్కువసేపు నిలబడటం, కూర్చునేందుకు తగిన వసతి లేకపోవడం వంటి ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. ముఖ్యంగా ఎండాకాలం, వర్షాకాలంలో విశ్రాంతి తీసుకోవడానికి అనువైన ప్రదేశం లేకపోవడం సమస్యగా మారుతుంది. ఈ నేపథ్యంలో వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షెడ్ భక్తులకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఆలయానికి వచ్చే వారు కొద్దిసేపు సేదతీరేందుకు, ఎండావానల నుంచి రక్షణ పొందేందుకు ఇది దోహదపడుతుంది.

హామీని నిలబెట్టుకున్న వైనం...

ఎన్నికల సమయంలో 32వ డివిజన్‌లోని వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం తన సొంత ఖర్చులతో షెడ్ నిర్మిస్తానని హామీ ఇచ్చానని మేయర్ ధర్ని మధుకర్ తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని షెడ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడాన్ని బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

స్థానిక అవసరాలపై దృష్టి

డివిజన్‌లో ప్రజల అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్నవనరులతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని మేయర్ తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, కాలనీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం షెడ్ నిర్మించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా.?

రైతుల కోసం సమరశంఖం!

రెండు రోజుల్లో సాగునీరు అందించాలి..

లేదంటే రైతులతో కలిసి మహా పోరాటం

బ్రాహ్మణపెల్లి పంప్‌హౌస్ వద్ద రైతుల గోడు విన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి

అన్నదాతల చెమట, పెట్టుబడి వృథా కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి





గోదావరిఖని, అక్టోబర్ 12 (సింగిడి): పంటలు చేతికొచ్చే సమయంలో సాగునీరు అందక అన్నదాతలు ఆందోళన చెందుతుంటే ప్రభుత్వానికి చలనం ఎందుకు రావడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి ప్రశ్నించారు. రైతుల పొలాలు ఎండిపోతూ, నెలల తరబడి వారు పడిన శ్రమ వృథా అయ్యే పరిస్థితులు నెలకొన్నా పాలకులు స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. రైతుల సాగునీటి కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు బ్రాహ్మణపెల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన ఆయన.. రైతులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

హామీలు సరిపోవు.. పంటలకు నీరందించాలి!

ఎన్నికల సమయంలో రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి అంటూ హామీలు గుప్పించిన నాయకులు.. ఇప్పుడు సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నా ఎందుకు స్పందించడం లేదని కౌశిక హరి నిలదీశారు. పంటల కీలక దశలో నీరు అందకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రసంగాలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

రెండు రోజుల్లో నీరివ్వాలి.. లేదంటే ఉద్యమమే!

సాగునీటి సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, మరో రెండు రోజుల్లోగా రైతులకు నీరు అందించాలని కౌశిక హరి స్పష్టం చేశారు. రైతుల పంటలను కాపాడటంలో నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. నిర్దిష్ట గడువులోగా సమస్య పరిష్కారం కాకపోతే రైతులను సమీకరించి, వారి హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని ప్రకటించారు. "రైతులకు కావాల్సింది మాటలు కాదు.. చేతల్లో చూపించే చిత్తశుద్ధి. హామీలు కాదు.. పంటలను కాపాడే సాగునీరు" అనే భావంతో ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

అన్నదాతలకు అండగా బీఆర్ఎస్

రైతుల ప్రయోజనాలను విస్మరిస్తే బీఆర్ఎస్ మౌనంగా ఉండబోదని కౌశిక హరి స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారమయ్యే వరకు వారి పక్షాన నిలబడతామని తెలిపారు. సాగునీటి కొరతతో రైతులు నష్టపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, వారి శ్రమకు తగిన ఫలితం దక్కేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సతీష్, బండారి ప్రవీణ్, మాజీ కార్పొరేటర్లు కాలువ శ్రీనివాస్, చింతకింది సంపత్, గాలేంకి ప్రసాద్, మల్లేష్, ప్రశాంత్ గౌడ్, తిరుపతి తదితరులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్యంపై దాడి

సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి: ప్రణవ్



జమ్మికుంట, అక్టోబర్ 12 (సింగిడి): ఓట్ల తొలగింపు రాజకీయ కుట్ర అని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో కాన్‌స్టిట్యూషనల్ క్లబ్ నుంచి సుప్రీంకోర్టు వరకు నిర్వహించిన మార్చ్ ఫర్ డెమోక్రసీ శాంతియుత నిరసన ర్యాలీలో తెలంగాణ కాంగ్రెస్ ప్రజాప్రతి నిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం రాహుల్ గాంధీకి పెరుగుతున్న ఆదరణను చూసి బీజేపీ భయపడి ఓటు చోరీకి పాల్పడు తోందని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని విమర్శించారు. ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ పోరాడుతుంటే, ఆయనను అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నా రని మండిపడ్డారు. ఓటు చోరీ ఆరోప ణలపై ఎన్నికల కమిషన్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిం చారు. అంతకుముందు భారఖంబా మెట్రో స్టేషన్ వద్ద కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు.

కేవీకేలో ప్రోటోకాల్ రగడ.. సీఎం ఫొటో ఏదీ?

చెక్కుల పంపిణీలో అధికారుల తీరుపై కౌన్సిలర్ విష్ణువర్ధన్ ఆగ్రహం

తహసీల్దార్ తీరుపై ఏఎంసీ చైర్‌పర్సన్ స్వప్న సదానందం అసహనం



జమ్మికుంట, అక్టోబర్ 12 (సింగిడి): జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సోమవారం నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం వివాదానికి వేదికైంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఫొటో ఏర్పాటు చేయకపోవడంపై 11వ వార్డు కౌన్సిలర్ పోనగంటి విష్ణువర్ధన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అధికారిక విధివిధానాలు పాటించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. సీఎం ఫొటో ఏర్పాటు చేయకపోవడానికి కారణాలు వెల్లడించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తహసీల్దార్ తీరుపై ఏఎంసీ చైర్‌పర్సన్ ఆగ్రహం

ఇదే కార్యక్రమంలో ప్రోటోకాల్ అంశంపై జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం స్థానిక తహసీల్దార్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ పాటించకుండా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తనకు ముందు వరుసలో సీటు కేటాయించాల్సి ఉండగా, వెనుక వరుసలో కూర్చోవాలని చెప్పడం సమంజసం కాదని అభ్యంతరం తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆమె పేర్కొన్నారు.

కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఏదీ?

రైతులకు 24 గంటల కరెంట్ ఏదీ?

దళితబంధు రెండో విడత అమలుచేయాలి



జమ్మికుంట అక్టోబర్ 12 (సింగిడి): కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం అందించాలని, రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తూ కాళేశ్వరం నీటిని వెంటనే విడుదల చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జమ్మికుంట మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద రూ. 1,00,116 ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం అందిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం కోతలతో ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన దళిత బంధు రెండో విడతను వెంటనే అమలు చేసి అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. గర్భిణులు, నవజాత శిశువుల సంక్షేమానికి ఉపయోగపడే కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలను పునఃప్రారంభించాలని సూచించారు. కమలాపూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, సుమారు 90 శాతం పూర్తయిన బస్‌స్టాండ్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు, పేదలు, దళితుల సంక్షేమంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పూర్తికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ జమ్మికుంట తహసిల్దార్ సుధాకర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ శంకర్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఖ్యాతి ప్రపంచ స్థాయిలో గుర్తింపు..

పదేళ్ల జిల్లా పండుగ.

పది తరాలకు గుర్తుండేలా

నలుదిశల చాటి చెప్పే విధంగా ముగింపు సభ..

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



సిద్దిపేట, అక్టోబర్ 12 (సింగిడి): సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగ పది తరాలకు గుర్తు ఉండేలా జరిగిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సంతోషం వ్యక్తం చేశారు.. ముగింపు సభ అద్భుతంగా జరిగిందని సభకు తరలివచ్చిన ప్రజానీకానికి కృషి చేసిన పార్టీ నాయకులకు కార్యకర్తలకు హరీష్ రావు కృతజ్ఞతలు తెలిపారు...సిద్దిపేట జిల్లా ఏర్పాటు జరిగి పదేళ్లు అయిన సందర్భంగా జిల్లా పండుగ చేద్దామని నిర్ణయం తీసుకున్నప్పటి నుండి ఆదివారం ముగింపు సభ అయ్యేంత వరకు ఎన్నో కార్యక్రమాలు ఎంతో మంది వివిధ రూపాల్లో చేశారని, ఎవరికీ వారు స్వచ్ఛందంగా నిర్వహించారని చెప్పారు. సన్నాహక సమావేశం లో ఎంతో మంది తమ సలహాలు సూచనలు ఇచ్చారని వారి అభిప్రాయాలు స్వీకరించి మూడు రోజుల కార్యక్రమం ఘనంగా నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమం లో భాగస్వామ్యం అయిన కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, లాయర్లు, ప్రజాసంఘాలు, వ్యాపారులు, విద్యావేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు తదితర సంఘాల ప్రతినిధులకు హరీష్ రావు ధన్యవాదాలు తెలిపారు. పదేళ్ల పండుగను మూడు గత వారం రోజుల నుండి పత్రిక ప్రకటనలు, ప్రత్యేక కథనాలు ప్రచురించి యూట్యూబ్ ఛానల్స్ ద్వారా సిద్దిపేట ఖ్యాతి ని ప్రపంచ స్థాయి లో తెలియజేశారని, అదేవిదంగా సోషల్ మీడియా లో ఎవరికీ వారు స్వచ్ఛందంగ సిద్దిపేట జిల్లా పండుగ స్ఫూర్తి ని చాటి చెప్పారని ఈ సందర్భంగా వారికి నా హృదయపూర్వక ధన్యవాదములని చెప్పారు. ఈ స్ఫూర్తి సిద్దిపేట జిల్లా అభివృద్ధి లో నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

మహాశక్తి ఆలయంలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

లింగార్చనలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, అక్టోబర్12 (సింగిడి): శ్రీ మహాశక్తి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా, వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి దర్శించుకున్నారు. వేదమాతగా, జ్ఞానప్రదా యినిగా పూజలందుకునే గాయత్రీదేవి ఆరాధనతో జ్ఞానం, వివేకం, పవిత్రత, ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. విద్య, ఏకాగ్రత, సత్ప్రవర్తన ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆలయంలో నిర్వహించిన లింగార్చనలో పాల్గొన్నారు. పిండితో లింగాకారాన్ని ప్రతిష్ఠించి అభిషేకం చేశారు. దీపాలు వెలిగించి అమ్మవారిని దర్శించుకున్నారు. భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్‌తో పాటు పలువురు నాయకులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు రెండో రోజు దాండియా వేడుకలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలోనే ఉంటూ అమ్మవారి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధూకర్ పరామర్శ..

ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు సానుభూతి..

మృతుల చిత్రపటాలకు పూలమాలలతో నివాళులు



గోదావరిఖని, అక్టోబర్ 12 (సింగిడి): ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, కష్టసుఖాల్లో భాగస్వాములు కావడం సామాజిక బాధ్యతగా భావిస్తూ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన ఇద్దరి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

జీడీ నగర్‌లో చందుపట్ల లక్ష్మి కుటుంబానికి పరామర్శ

పాలకుర్తి మండలం జీడీ నగర్ బీసీ కాలనీలో ఇటీవల మృతి చెందిన చందుపట్ల లక్ష్మి కుటుంబ సభ్యులను పుట్ట మధూకర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి బాధను పంచుకున్నారు. ఈ విషాద సమయంలో వారికి ధైర్యం చెప్పారు. బసంత్‌నగర్ సుభాష్ నగర్‌లో పల్లికొండ వెంకటస్వామి తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పుట్ట మధూకర్ పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో భామ్లా నాయక్ తండా మాజీ సర్పంచ్ రాజు నాయక్, మాజీ ఎంపీటీసీ అతిక్, కిరణ్, ఖాదర్ ఫాసా, వెంకటస్వామి, కమలాకర్, తాటిపాముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఓ నం. 1181 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 15న మహా ధర్నా



హనుమకొండ, అక్టోబర్ 12 (సింగిడి): తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జీవో నం. 1181ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 15న సీడీఎంఏ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహా ధర్నాలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ శాఖ ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వక్కల రాణాసాగర్, కొత్తకొండ శ్రీనివాస్, శ్రీనివాస్, మరియు యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మహా ధర్నాకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని అందించేందుకు యూనియన్ నాయకులు ఈరోజు గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం, జీవో నం. 1181ను రద్దు చేయడం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమాన్ని పరిరక్షించడం తదితర డిమాండ్ల సాధన కోసం ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా తరలివచ్చి మహా ధర్నాను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

రైతన్నలు ఆరుతడి పంటలపై దృష్టిపెట్టాలి...

జిల్లా కలెక్టర్ కె. హైమావతి



సిద్దిపేట, అక్టోబర్,12 (సింగిడి): ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున, ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి స్పష్టం చేశారు. సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. హుస్నాబాద్ రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ కే. హైమావతి వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ను తిలకించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, కౌన్సిలర్లు మరియు పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోలీస్ ధ్రువీకరణ త్వరగా పూర్తి చేయాలి

పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు ఉద్యోగుల జేఏసీ జన్మదిన శుభాకాంక్షలు



కరీంనగర్, అక్టోబర్12(సింగిడి): పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్‌ను ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జేఏసీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోలీస్ ధ్రువీకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్, ప్రక్రియను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సమస్యపై తక్షణమే స్పందించిన కమిషనర్‌కు దారం శ్రీనివాస్ రెడ్డి ఉద్యోగుల జేఏసీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, రాష్ట్ర నాయకులు సర్దార్ హర్పిందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, లవకుమార్, జీవన్ రెడ్డి, అజయ్, ఆనంద్, రాకేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ దావత్ స్టైల్ మటన్ కర్రీ

ఇంట్లోనే ఈజీగా.. పులావ్

చపాతీల్లోకి సూపర్ కాంబో





ముందుగా, స్టవ్ మీద ఒక పాన్ పెట్టి, అందులో రెండు చెంచాల ధనియాలు, ఒక చెంచా మిరియాలు, ఒక చెంచా జీలకర్ర, పది యాలకులు, పది లవంగాలు, రెండు నల్ల యాలకులు, కొద్దిగా దాల్చిన చెక్క, పావు చెంచా షాజీరా, పావు కప్పు ఎండు కొబ్బరి తురుము వేసి మంటను తక్కువ మంటపై ఉంచి కలుపుతూ వేయించాలి.

ఇవి కొద్దిగా వేగిన తర్వాత, స్టవ్ ఆఫ్ చేసి, రెండు చెంచాల గసగసాలు వేసి కలపాలి. పాన్ లో ఉండే వేడికి గసగసాలు కొంచెం వేగుతాయి. పూర్తిగా చల్లారిన తర్వాత వీటిని మిక్సీ జార్లో వేసి, కొద్దిగా నీళ్లు పోసి మెత్తటి పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. గసగసాలు సరిగ్గా నలగకపోతే గ్రేవీ పలుకులుగా ఉండి రుచి తగ్గుతుంది కాబట్టి మసాలా పేస్ట్ చాలా మెత్తగా ఉండాలి.

ఉల్లిపాయలు చక్కగా వేగిన తర్వాత, రెండు చెంచాల అల్లం వెల్లుల్లి పేస్ట్, అర చెంచా పసుపు వేసి బాగా కలపాలి. శుభ్రంగా కడిగి పెట్టుకున్న ఒక కిలో లేత మటన్‌ను వేసి, హై ఫ్లేమ్‌లో ఐదు నుండి పది నిమిషాల పాటు కలుపుతూ వేయించాలి. మటన్ నుండి నీరు ఊరి, ఆ నీరు ఆవిరి అయ్యేవరకు వేయించాలి. మంటను లో ఫ్లేమ్‌కి మార్చి మూత పెట్టి పది నిమిషాలు ఉడకనివ్వాలి.



పది నిమిషాల తర్వాత మూత తీసి ఒకసారి కలిపి, రుచికి సరిపడా ఉప్పు, రెండు నుండి మూడు చెంచాల కారం వేసి రెండు నిమిషాల పాటు వేయించాలి. మటన్ నూనెలో చక్కగా వేగి, నీరు ఆవిరై నూనె పైకి కనిపిస్తున్నప్పుడు, కూర ఉడకడానికి, గ్రేవీకి సరిపడినన్ని వేడి నీళ్లు పోయాలి. నాన్-వెజ్ కూరలలో చల్లటి నీళ్లకు బదులుగా వేడి నీళ్లు వాడితే కూర చక్కగా ఉడుకుతుంది. ఇదంతా ఒకసారి కలిపి, మూత పెట్టి, మంటను లో ఫ్లేమ్‌లో ఉంచి మరో పదిహేను నిమిషాల పాటు ఉడకనివ్వాలి. లేత మటన్ అయితే త్వరగా ఉడుకుతుంది. ఒకవేళ ముదురు మటన్ అయితే, ప్రెషర్ కుక్కర్‌లో మూడు నుండి నాలుగు విజిల్స్ వచ్చేవరకు ఉడికించుకోవచ్చు.

కూర 90% ఉడికిన తర్వాత, ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న మసాలా పేస్ట్ వేసి రెండు నిమిషాల పాటు వేయించాలి. ఈ దశలో రుచి చూసి ఉప్పు, కారం కూడా వేసుకుంటే మంచిగా ఉంటుంది. నాన్-వెజ్ కూరలు కొంచెం ఘాటుగా ఉంటేనే బాగుంటాయి కాబట్టి అవసరాన్ని బట్టి మరో చెంచా కారం కలుపుకోవచ్చు. మసాలా గ్రైండ్ చేసిన మిక్సీ జార్లో కొద్దిగా నీళ్లు పోసి, ఆ నీటిని కూడా కూరలో పోసి, గ్రేవీకి సరిపడినంత నీరు కలిపి, మూత పెట్టి నూనె పైకి తేలే వరకు ఉడికించాలి



ఒక మందపాటి కడాయి లేదా కుక్కర్‌ను స్టవ్ మీద పెట్టి, ఏడు నుండి ఎనిమిది చెంచాల నూనె వేయాలి. నూనె వేడైన తర్వాత, ఒక బిర్యానీ ఆకు, చిన్న జాపత్రి, ఒక అనాస పువ్వు, ఏడు నుండి ఎనిమిది మిరియాలు వేయించాలి. ఈ మసాలా దినుసులు నూనెలో వేయడం వల్ల కూరకి అద్భుతమైన ఫ్లేవర్ వస్తుంది. పది సన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు, ఒక గుప్పెడు పుదీనా ఆకులు వేసి కలపాలి. మనం రెగ్యులర్ మటన్ కర్రీలో కరివేపాకు వేసినప్పటికీ, తెలంగాణ దావత్ స్టైల్ లో పుదీనా ఆకులను ఉపయోగిస్తారు. ఇప్పుడు, ఒక పెద్ద ఉల్లిపాయను సన్నగా పొడవుగా కట్ చేసి వేసి, మంటను హై ఫ్లేమ్‌లో ఉంచి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి.

ఇన్వెస్టర్లకు

పండగే..

TCS, వేదాంత,

ఓలా సహా 14 స్టాక్స్

ఈ వారమే బోనస్, డివిడెండ్, స్టాక్స్ స్ప్లిట్స్ రికార్డ్ తేదీలు!



దేశీయ స్టాక్ మార్కెట్లో ఈ వారం ట్రేడింగ్ ఇన్వెస్టర్లు పండగలా మారనుంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, వేదాంత, ఓలా ఎలక్ట్రిక్ వంటి 14 కంపెనీలు బోనస్ షేర్లు, డివిడెండ్, స్టాక్ స్ప్లిట్, రైట్స్ ఇష్యూలకు రికార్డ్ తేదీలను ఈ వారంలోనే నిర్ణయించాయి. దీంతో ఇన్వెస్టర్లకు అదనపు షేర్లు, డివిడెండ్ సొమ్ములు అందున్నాయి. ఈ వారం ఎక్స్ రికార్డ్ తేదీలు ఉన్న కంపెనీలు, వాటి స్టాక్స్ పని తీరు గురించిన వివరాలు ఇప్పుడే మనం తెలుసుకుందాం. స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు ఈ వారం (అక్టోబర్ 12 నుంచి అక్టోబర్ 16 వరకు) అత్యంత కీలకమైనదిగా మారనుంది. దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మైనింగ్ దిగ్గజం వేదాంత, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ సహా మొత్తం 14 ప్రముఖ కంపెనీలు తమ కార్పొరేట్ యాక్షన్లకు సంబంధించిన ఎక్స్ రికార్డ్ తేదీలను జరుపుకోవడానికి సిద్ధమయ్యాయి. ఈ కార్పొరేట్ యాక్షన్లలో భాగంగా డివిడెండ్లు , ఉచిత బోనస్ షేర్లు , రైట్స్ ఇష్యూలు, స్టాక్ స్ప్లిట్స్ ఉన్నాయి. మరి ఏ ఏ రోజు ఏ స్టాక్ ట్రేడ్ కానుందో ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.

డివిడెండ్, బోనస్ ఇష్యూ రికార్డ్ తేదీలు

అక్టోబర్ 12వ తేదీ సోమవారం రోజున జోజో లిమిటెడ్ కంపెనీ 1:1 బోనస్ ఇష్యూ రికార్డ్ తేదీగా నిర్ణయించింది. ఆలోపు షేర్లు కొన్నవారికి 1 షేరుకు మరో షేరు ఉచితంగా వస్తుంది.

అక్టోబర్ 13వ తేదీ మంగళవారం రోజున ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ రైట్స్ ఇష్యూకు సంబంధించిన రికార్డ్ తేదీ ప్రకటించింది. షేర్ హోల్డర్లు రూ. 27 చొప్పున రైట్స్ ఇష్యూలో పాల్గొనవచ్చు. ఇదే రోజున అవెన్యూస్ ఏఐ లిమిటెడ్ కంపెనీ షేర్ కాన్సాలిడేషన్ రికార్డ్ తేదీగా నిర్ణయించింది. అక్టోబర్ 14వ తేదీ బుధవారం రోజున టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కంపెనీ రెండో మధ్యతర డివిడెండ్ రికార్డ్ తేదీగా నిర్ణయించింది. ఒక్కో షేరుకు రూ. 12 చొప్పున చెల్లిస్తోంది. ఇదో రోజున వేదాంత కంపెనీ సైతం మధ్యంతర డివిడెండ్ రికార్డ్ తేదీగా నిర్ణయించింది. ఒక్కో షేరుకు రూ. 5 చొప్పున రూ. 1955 కోట్లు చెల్లిస్తామని తెలిపింది. వీటితో పాటు కాంటినెంటల్ కంట్రోల్స్ కంపెనీ రైట్స్ ఇష్యూ రికార్డ్ తేదీగా నిర్ణయించింది.అక్టోబర్ 15వ తేదీ గురువారం రోజున ఆనంద్ రాఠీ వెల్త్ కంపెనీ మధ్యతంర డివిడెండ్ రూ. 4 చొప్పున అందిస్తోంది. అలాగే సమోర్ రియాల్టీ లిమిటెడ్ కంపెనీ 1:5 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేస్తోంది. అలాగే వన్ క్లిక్ లాజిస్టిక్స్ ఇండియా కంపెనీ 1:2 రేషియోలో బోనస్ షేర్లు ఇస్తోంది. వీటితో పాటు శివమ్ ఆటోటెక్ అండ్ శ్రద్దా ప్రైమ్ కంపెనీ రైట్స్ ఇష్యూకు వస్తోంది. వీటితో పాటుఅక్టోబర్ 16వ తేదీ శుక్రవారం రోజున బన్సాల్ వైర్ ఇండస్ట్రీస్ 1:5 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపడుతోంది. అలాగే కెనరా రొబెకో ఏఎంసీ ఒక్కో షేరుకు రూ. 2 చొప్పున డివిడెండ్ చెల్లిస్తోంది. అలాగే నోబుల్ పాలిమెర్స్ స్టాక్ కన్సాలిడేషన్ రికార్డ్ తేదీగా నిర్ణయించింది.

ఇన్వెస్టర్లు గమనించాల్సిన అంశాలు

ఎక్స్ - డేట్ రోజున లేదా అంతకు ముందు రోజే డీమ్యాట్ ఖాతాలో షేర్లు కలిగి ఉన్నవారికి మాత్రమే డివిడెండ్లు, బోనస్ ప్రయోజనాలు లభిస్తాయి. భారతీయ మార్కెట్లో ంం1 సైకిల్ అమలులో ఉన్నందున, కార్పొరేట్ ప్రయోజనం పొందాలనుకునే ఇన్వెస్టర్లు ఎక్స్ తేదీ నాటికి కనీసం ఒక రోజు ముందే కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

స్టాక్ మార్కెట్ Stock Market

జపాన్‌లో తెలంగాణ యువతకు

ఉద్యోగావకాశాలు : మంత్రి వివేక్





హైదరాబాద్ బ్యూరో, (సింగిడి): హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో నా రా జపాన్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హైదరాబాద్ జపాన్ ఫెస్టివల్ 2026 ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు 10 వేలకు పైగా ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, జపాన్‌లో పెరుగుతున్న ఉద్యోగావకాశాలను తెలంగాణ యువత అందిపుచ్చు కునేలా నైపుణ్య శిక్షణ అందిస్తామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో 45 లక్షల మందికి శిక్షణ ఇవ్వడమే లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 169 జపాన్ కంపెనీలు పనిచేస్తున్నాయని, మరిన్ని కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని కోరారు. టామ్‌కామ్ ద్వారా 16 దేశాల్లో 14,500కు పైగా ఉద్యోగావకాశాలు కల్పించినట్లు వెల్లడించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, జపాన్‌తో ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, తయారీ రంగాల్లో సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. మియోషి పప్పెట్ షో, ఇకెబానా పుష్పాలంకరణ, ఇంటో --జపాన్ ఇన్నోవేషన్ హ్యాకథాన్, అనిమే, కాస్ప్లే ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జపాన్‌లో విద్య, ఉద్యోగావకాశాలపై నిర్వహించిన సదస్సు యువతను ఆకట్టుకుంది. నా రా జపాన్ హబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బి. రామ భద్ర, సహ వ్యవస్థాపకుడు ఎన్. నాగనాథ్‌తో పాటు జపాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





దసరా వేళ

బంగారం ధరలు



దసరా పండగ సీజన్ మొదలైంది. ప్రస్తుతం దేశంలో తులం బంగారం రేటు రూ. 1,50,000 స్థాయిలో ఉంది. అయితే, 2000 సంవత్సరంలో తులం బంగారం రేటు కేవలం రూ. 4400 ఉంది అంటే నమ్ముతారా? అవునండీ నిజమే.. అప్పుడు అంత తక్కువ ఉండగా ఇప్పుడు 34 రెట్లు పెరిగింది. ఈ 26 ఏళ్ల దసరా ప్రయాణంలో ఎప్పుడు ఎంత ధర ఉంది అనేది ఒకసారి గుర్తు చేసుకుందాం. భారతీయ సాంప్రదాయంలో దసరా, ధంతేరాస్ పండుగలకు పసిడి కొనుగోలుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. బంగారం కేవలం ఒక ఆభరణం మాత్రమే కాదు, భారతీయులకు అత్యంత విశ్వసనీయమైన పెట్టుబడి సాధనం. 2000వ సంవత్సరం దసరా పండుగ సమయంలో 10 గ్రాముల తులం బంగారం రేటు కేవలం రూ. 4,400 గా ఉండగా 2026 అక్టోబర్ దసరా పండుగ నాటికి ఆ ధర రూ. 1,50,000 మార్క్ తాకింది. గడిచిన 26 సంవత్సరాల వ్యవధిలో పసిడి ధర ఏకంగా 34 రెట్లు పెరిగి ఇన్వెస్టర్లకు బంగారం లాంటి రాబడిని అందించింది. ఈ 26 ఏళ్ల కాలంలో పసిడి సాగించిన చారిత్రాత్మక ప్రయాణం, ప్రతీ సంవత్సరం దసరా నాటి ధరల గణాంకాలు, పసిడి ఇంతటి భారీ ఎత్తుకు చేరుకోవడానికి గల కారణాలను తెలుసుకుందాం.

2000 నుంచి 2026 వరకు
దసరా పండుగ నాటి బంగారం ధరలు
2000 సంవత్సరం దసరా రోజు 10 గ్రాముల బంగారం ధర రూ. 4,400
2001లో తులం బంగారం రేటు రూ. 4,300
2002లో తులం బంగారం ధర రూ. 4,990
2003లో తులం బంగారం రేటు రూ.5600, తొలిసారి రూ. 5 వేల మార్క్ దాటిన ధర
2004లో 10 గ్రాముల పసిడి రేటు రూ. 6,307
2005లో 10 గ్రాముల పసిడి రేటు రూ. 7,638
2006లో 10 గ్రాముల పసిడి రేటు రూ. 9,265
2007లో 10 గ్రాముల పసిడి రేటు రూ. 10,598, తొలిసారి రూ. 10 వేల మైలురాయి
2008లో 10 గ్రాముల పసిడి రేటు రూ. 13,630
2009లో తులం బంగారం రేటు రూ. 16,686
2010లో తులం బంగారం రేటు రూ. 20,728, తొలిసారి రూ. 20,000 మార్క్ దాటిన ధర

ఇప్పటి నుంచి 99 శాతం మేర ట్యాక్స్?

పరిమితికి మించి ఆదాయం వచ్చినప్పుడు ప్రభుత్వానికి ట్యాక్స్ కట్టాలి. ప్రతి ఏటా ఐటీ రిటర్నులు ఫైల్ చేసి తమ ఆదాయ, వ్యయ, ట్యాక్స్ వివరాలను వెల్లడించాలి. అయితే, చాలా మంది ఆదాయాన్ని దాటి పెట్టి ట్యాక్స్ తప్పించుకునే ప్రయత్నం చేస్తారు. ఐటీ శాఖ తనిఖీలు చేసినప్పుడు పెద్ద మొత్తంలో డబ్బులు, ఆస్తులు లభించినప్పుడు ఐటీ రిటర్నుల్లో చూపించలేదని తేలడం, లెక్క చూపని ఆదాయంగా భావిస్తే ఇకపై 99 శాతం మేర పెనాల్టీ పడవచ్చు. ఈ అంశంపై సీఏ దుర్గ అంజలీ వీడియో ద్వారా వివరించారు.ఆదాయపు పన్ను రిటర్నులు లో ఆదాయాన్ని తక్కువగా చూపడం లేదా అసలు ఆదాయాన్ని దాచిపెట్టడం వంటి వాటి ద్వారా పన్ను చెల్లింపుదారుడికి ఊహించని నష్టాన్ని తెచ్చిపెడుతుంది. ఐటీఆర్‌లో చూపించకుండా ఆదాయం దాచిపెడితే 99 శాతం వరకు పన్ను పడే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు ఇది 86 శాతంగా ఉండగా దానిని కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025లో 99 శాతానికి పెంచినట్లు సీఏ దుర్గ అంజలి సోషల్ మీడియా ద్వారా వివరించే ప్రయత్నం చేశారు. మరి



నిజంగానే 99 శాతం మేర పెనాల్టీ పడుతుందా? ట్యాక్స్ నిపుణురాలు చెప్పిన వీడియోలోని ప్రధాన అంశాలు ఏంటి అనేది తెలుసుకుందాం.

"ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు ఇంటిమీద, పొలాల మీద దాడి చేసినప్పుడు బోలెడంత డబ్బు దొరికింది అనుకుందాం. ఇప్పటి వరకు దానిపై 86 శాతం ట్యాక్స్ వేసి 14 శాతం తిరిగి ఇచ్చి వెళ్లండి అనేవారు. కానీ, ఇప్పుడు అందుకు ఛాన్స్ లేదు. ఎందుకంటే ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 2025 నుంచి 99 శాతం ట్యాక్స్ కట్ చేస్తున్నారు. ఇంతకు ముందు లెక్క చూపని ఆదాయం ఉంటే బేస్ రేటు 60 శాతం దాని మీద 20 శాతం సర్ ఛార్జీ ప్లస్ 4 శాతం సెస్ మొత్తంగా 86 శాతం పెనాల్టీ కట్టించుకునే వారు. కానీ ఇప్పుడు అది 99 శాతానికి చేరుకుంది.ఇందులో 2 సెక్షన్లు ఉన్నాయి. ఒకటి మిస్ రిపోర్టింగ్ ఇన్‌కమ్, ఇంకోటి లెక్క చూపని ఆదాయం. లెక్కచూపని ఇన్‌కమ్ బేస్ రేట్ తగ్గించారు. ఇప్పుడు 30 శాతమే అంటే తగ్గింది కదా అని అనుకుంటారు. దీనికి మిస్ రిపోర్టింగ్ ఇన్‌కమ్ అనేది వచ్చి చేరింది. దీనిపై పెనాల్టీ లెక్కచూపని ఆదాయంపైన బేస్ రేటుకు 200 శాతం కట్టాల్సి ఉంటుంది. అంటే మొత్తంగా 99 శాతం వరకు పెనాల్టీ పడవచ్చు." సీఏ దుర్గ అంజలి అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 68, 69, సెక్షన్ 115 నిబంధనలతో పాటు సెక్షన్ 270 271జకింద విధించే పన్ను, సర్ ఛార్జీ, సెస్‌లు, పెనాల్టీలు కలిపి లెక్కిస్తే పట్టుబడిన దాచిన ఆదాయంపై గరిష్ఠగా 78 శాతం నుంచి 99 శాతం వరకు పన్ను పడే అవకాశం ఉంటుంది. ఐటీ శాఖ తనిఖీల్లో లేదా అసెస్మెంట్ ప్రాసెస్‌లో దొరికిన అదనపు నిధులకు పన్ను చెల్లింపుదారు తగిన ఆధారాలు చూపకపోతే దానిని దాచిన లేదా వివరణ లేని ఆదాయంగా పరిగణిస్తారు. ఇందులో బ్యాంక్ ఖాతాలో వేసిన పెద్ద మొత్తంలో నగదు జమలు, భూములు, ఇళ్లు, షేర్లు, బంగారం వంటి ఆస్తులలో పెట్టిన నిధులకు ఐటీఆర్ లో మూల చూపలేకపోవడం, రైడ్‌లలో లభించిన భారీ నగదు లేదా ఆభరణాలు, ఖర్చు చేసినట్లు చూపించిన దానికి సంబంధించిన బిల్లులు లేదా లెక్కలు లేకపోవడం వంటివి ఉంటాయి.ఐటీ శాఖ సాధారణ స్లాబ్ రేట్లను కాకుండా దాచిన ఆదాయానికి ప్రత్యేక గరిష్ఠ పన్ను రేట్లను అప్లై చేస్తుంది. సాధారణ పన్ను రేటు 60 శాతంగా ఉంటుంది.

దానిపై సర్ ఛార్జీ 15 శాతం, హెల్త్, ఎడ్యుకేషన్ సెస్ 3 శాతం మొత్తం 78 శాతం వరకు ఉంటుంది. దీనికి అదనంగా పెనాల్టీ 5 శాతం, సమాచారం దాచడం పై పెనాల్టీ 15 శాతం వరకు వడ్డీ భారం వంటివి కలిపి మొత్తంగా 99 శాతం వరకు చేరే ప్రమాదం ఉంది. వీటితో పాటు సెక్షన్ 80సీ, 80డీ వంటి పన్ను మినహాయింపులు సైతం కోల్పోవాల్సి వస్తుంది.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం 13-10-2026

ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలది దుష్ప్రచారమే

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం, ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచన

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు



కరీంనగర్, (సింగిడి): ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు విమర్శించారు. ఆదివారం కరీంన గర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నకిలీ, బహుళ ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందించడమే సమగ్ర సవరణ ప్రధా న ఉద్దేశమని తెలిపారు. దేశవ్యాప్తంగా 95 కోట్ల మంది ఓటర్లకు సంబంధించి 82 కోట్ల మంది నమోదు ప్రక్రియ పూర్తిచేసుకున్నారని, సుమారు 13 కోట్ల మంది ఓటర్ల వివరాలు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నాయని పేర్కొ న్నారు. మరణించినవారు, ఇతర ప్రాంతాలకు మారినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైనవారి వివరాలను పరిశీలించి జాబితాను సరిచేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా ఈ ప్రక్రియను పరిశీలించవచ్చన్నారు. ఓటరు జాబితాలో పేరులేని అర్హులు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, అభ్యంతరాలపై ఫారం-7 ద్వారా విచారణ చేపట్టి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటారని వివరించారు. దేశవ్యాప్తంగా 95 కోట్ల మంది ఓటర్లలో 25 లక్షల మంది పేర్లు తొలగించగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 8 వేల మంది పేర్లు తొలగించి నట్లు వెల్లడించారు. ఓటు తొలగింపుపై ఆధారాలు ఉన్నవారు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని సునీల్‌రావు సూచించారు. ఓటు కోల్పోయినట్లు ఎవరైనా దరఖాస్తు చేస్తే వాటిని బహిర్గతం చేయాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిం చేందుకు ఎన్నికల అధికారులు చేపడుతున్న ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఎస్ఐఆర్‌పై ప్రతిప క్షాలు చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని విమర్శిం చారు. స్వచ్ఛమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి బలమ ని, ప్రజలు వాస్తవాలను గమనించాలని అన్నారు. ఈ సమా వేశంలో బీజేపీ కార్పొరేటర్లు తోట అనిల్, మాసం గణేష్, కొంపెల్లి రామన్, సోమిడి వేణుప్రసాద్, పొన్నం మొండయ్య గౌడ్, కర్రె అనిల్, కోఆప్షన్ సభ్యుడు సర్దార్ బల్బీర్ సింగ్, నాయకులు పండుగ నాగరాజు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు ఘన స్వాగతం

దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు రాక



బిక్కనూర్,(సింగిడి): తెలంగాణ రాష్ట్ర పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క దక్షిణాఫ్రికా అధి కార పర్యటన ముగించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకు న్నారు. ఈ సందర్భంగా తిప్పా పూర్ పీఏసీఎస్ చైర్మన్ తిరుపరి భీమ్ రెడ్డి, విశ్వ భరత్ రెడ్డి విమానాశ్రయంలో మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేసి, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. దక్షిణాఫ్రికా పర్యటన విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు.

దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

ముల్కనూర్‌లో వైభవంగా అమ్మవారి ప్రతిష్ఠ



భీమదేవరపల్లి, (సింగిడి): కులమతాలకు అతీతంగా ఐకమత్యమే లక్ష్యంగా ముల్కనూర్‌లో గత 14 ఏళ్లుగా వివేకానంద యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వేదమంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. 45 మంది సభ్యులతో ఏర్పాటైన వివేకానంద యూత్ సభ్యులు ప్రతి నెలా చిట్టీ రూపంలో నిధులు సమకూర్చుకుని వినాయక చవితి, దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను నిర్వహి స్తున్నారు. వేద పండితులు శివ ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్ఠ కార్యక్రమంలో విగ్రహ దాతలు బసవరాజుల రమేష్, అనూషతో పాటు మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆధ్యా త్మికతతో పాటు గ్రామ ఐకమత్యం, సామాజిక సామరస్యానికి ఈ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తున్నాయి.

జన్మదిన వేళ.. సేవా కార్యక్రమాలు



బిక్కనూర్, (సింగిడి): బిక్కనూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పురాం రాజమౌళి తన 63వ జన్మదినం సందర్భంగా బిక్కనూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు దుప్పట్లు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో జరుపుకుంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు తన వంతు సహాయం అందించారు.

కంచర్లలో యూత్ కాంగ్రెస్‌కు నూతన అధ్యక్షుడు మంద బాబు



భిక్కనూర్,(సింగిడి): భిక్కనూర్ మండలం కంచర్ల గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మంద బాబు ఎన్నిక య్యారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచనల మేరకు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరాం వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను గ్రామ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాం వెంకటేష్ మాట్లాడుతూ యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి యువజన కాంగ్రెస్ కృషి చేస్తుందని తెలిపారు. గ్రామస్థాయిలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తూ యువతను ప్రజాసేవలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల రాములు, యాదగౌడ్, తిరుమల స్వామి, గుడిసె నారా యణ, సందని స్వామి, పరుశరాములు, నర్సింలు, మండల యూత్ కాంగ్రెస్ కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన మంద బాబుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కూల్చివేతలో పశువుల పాక నేలమట్టం.. నష్టపరిహారం చెల్లించాలి

- కలెక్టర్‌కు రైతు కట్టెకోల మధుకర్ విజ్ఞప్తి



మల్హర్, (సింగిడి): మల్హర్ మండలం తాడిచర్ల గ్రామ పరిధిలోని శాత్రాజ్‌పల్లిలో ఓసీపీ బ్లాక్-2 మైనింగ్ నేపథ్యంలో శని వారం రాత్రి రెవెన్యూ, పోలీస్, సింగరేణి అధికారులు చేపట్టిన కూల్చివేతల్లో తన పశువుల పాక ను సైతం నేలమట్టం చేశారని రైతు కట్టెకోల మధుకర్ ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా వ్యవసాయంపై ఆధా రపడి జీవిస్తున్న తనకు ఈ ఘటనతో అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన పశువుల పాకను కూల్చివేయడంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జరిగిన నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం చెల్లించి తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఏఐసీసీ పిలుపు మేరకు ఛలో ఢిల్లీ

CEC జ్ఞానేష్ కుమార్ తీరును నిరసిస్తూ రాజ్యాంగ పరిరక్షణ

ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పోరాటం

ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి మద్దతుగా ఢిల్లీకి బయలుదేరిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్.



వరంగల్,(సింగిడి): ఏఐసీసీ పిలుపు మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (CEC) జ్ఞానేష్ కు మార్ తీరును నిరసిస్తూ, ఓటు హక్కు పరిరక్షణ కోసం కాం గ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజాస్వామ్య పోరాటానికి మద్దతుగా రేపు 12వ తేదీన ఢిల్లీలో జరగబోయే ప్రజాస్వామ్య పరిరక్షణ పో రాట యాత్రలో పాల్గొనేందుకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ మహమ్మద్ అయూబ్ గారు నేడు ఢిల్లీకి బయ లుదేరారు. దేశంలో ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల ప్రక్రి యలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ లక్ష్యం గా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "ఛలో ఢిల్లీ" కార్యక్రమంలో భాగం గా ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీ కేసీ వేణుగోపాల్ గారి పిలుపు మేరకు ఢిల్లీలో నిర్వహించ నున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు, టీపీసీసీ అధ్యక్షుడు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గారు, రాష్ట్ర మంత్రు లు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపా ధ్యక్షులు, కార్యదర్శులు తదితర ముఖ్య నాయకులు హాజ రుకానున్నా రు. ఈ సందర్భంగా ఓటు హక్కుపరిరక్షణ, ఎన్నికల ప్రక్రియ లో పారదర్శకత, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయ డం వంటి అంశాలపై కాంగ్రెస్ పార్టీ తన పోరా టాన్ని మరిం త ఉధృతం చేయాలని లక్ష్యంగా పెట్టు కుంది. ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం ప్రజాస్వామ్య పరిర క్షణ లో కీలకమని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఈ లక్ష్యంతో పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీలో జరిగే కార్య క్రమా ల్లో పాల్గొనేందుకు మహమ్మద్ అయూబ్ గారు బయలుదేరారు

దళిత బంధు నిధులు విడుదల చేయాలి

దసరాలోపు నిధులిస్తామని మంత్రుల హామీ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



జమ్మికుంట, (సింగిడి): నియోజక వర్గం లోని దళిత కుటుంబాలకు దళిత బంధు పథకం రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. దళిత కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని కోరారు. రెండో విడత నిధుల విడుదలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లను కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ దసరాలోపు నిధులను విడుదల చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దసరాలోపే నిధులను విడుదల చేసి దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. దళిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిరంతరం పోరాడుతానని కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు.

భక్తులకు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు

కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం





భీమదేవరపల్లి, (సింగిడి): శరన్నవరాత్రి ఉత్సవాల తొలిరోజు కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఆల యంలో ప్రత్యేక పూజలు, వైదిక క్రతువులను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముం దుగా గణపతి పూజ, శైవశుద్ధి, పుణ్యాహ వచనం, సర్వతోభద్ర మండల ఆవాహనతో పాటు చతుఃషష్టి ఉపచార పూజలు నిర్వహిం చారు. అనంతరం అమ్మవారిని బాలాత్రిపుర సుందరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పి. కిషన్‌రావు పర్యవేక్షణలో పూజా కార్యక్ర మాలు నిర్వహించారు.

స్నేహితుడి కుటుంబానికి 50 వేల ఆర్థిక సహాయం..



డోర్నకల్ /మరిపెడ (సింగిడి): స్నేహబంధానికి, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా శ్రీ రాఘవ విద్యానికేతన్ హైస్కూల్ 2000వ సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు నిలిచారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ఆరో వార్డుకు చెందిన పాల్వాయి భాస్కర్ ఇటీవల మృతి చెందడంతో, విషయం తెలుసుకున్న ఆయన పూర్వ విద్యార్థి మిత్రులు స్పందించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. తమతో కలిసి చదువుకున్న స్నేహి తుడు మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మిత్రులు, భాస్కర్ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన సతీమణి మమతకు అందిం చారు. ఈ సందర్భంగా భాస్కర్ ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించి,వారి భవిష్య త్తుకు బంగారు బాటలు వేయాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అంతేకాకుండా, భవిష్యత్తులో పిల్లల చదువులకు లేదా కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా తమ వంతు సహాయం అందించేందుకు ముందుంటామని భరోసా ఇచ్చారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, భవిష్యత్తులోనూ తోడుగా ఉంటామని భరోసా ఇచ్చిన స్నేహితులకు భాస్కర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారుల ఆరోగ్యమే లక్ష్యం



పురుగుమందుల అవశేషాల నియంత్రణపై రైతులకు అవగాహన



భీమదేవరపల్లి ,(సింగిడి): రైతులు అధిక దిగుబడితో పాటు నాణ్యమైన, సురక్షితమైన ధాన్యాన్ని ఉత్పత్తి చేయాలని ముల్కనూర్ సహకార సంఘం అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వరి సాగులో పురుగుమందుల అవశేషాల నియంత్రణపై రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముల్కనూర్ సహకార సంఘం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా సంస్థ సంచాలకులు, వరి శాస్త్రవేత్త డాక్టర్ వై. చంద్ర మోహన్ పురుగుమందుల సురక్షిత వినియోగం, చీడపీడల నివారణ, పంట కోతకు ముందు పాటించాల్సిన జాగ్రత్తలు, ఎగుమతి ప్రమాణాలపై రైతులకు వివరించారు. రైతులకు గిట్టుబా టు ఆదాయం లభించడంతో పాటు వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే తమ లక్ష్యమని ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎం. రాంరెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సతీష్, వ్యవసాయ అధికారులు, సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం!

ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్



జమ్మికుంట, (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వ హించేందుకు జమ్మికుంట మున్సిపల్ పాలక వర్గం ఏర్పాట్లు ప్రారంభించింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, నాయిని చెరువు వద్ద మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ఏర్పాట్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిది రోజులపాటు సాగే బతుకమ్మ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేపడు తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రకృతిని, పూలను పూజించే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పూల పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం మున్సిపల్ పాలకవర్గం బాధ్యత అని తెలిపారు. సద్దుల బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పొనగంటి రాము పొనగంటి విష్ణు కొలుగూరి సురేష్‌తూర్పాటి శంకర్ ఎన్విరాన్మెంట్ అధికారి శ్రీకాంత్ కాంట్రాక్టర్ ఓర్సు శ్రీనివాస్ మార్కెట్ డైరెక్టర్ గడ్డం దీక్షిత్ గౌడ్ ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో బస్టాండ్‌కు మరమ్మతులు!

ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి ముందుకొచ్చిన ఉపసర్పంచ్



భీమదేవరపల్లి, (సింగిడి):: ప్రజా సమస్యల పరిష్కారానికి పదవే కాదు.. సేవాభావం కూడా ముఖ్యమని చాటుతూ ముల్కనూర్ ఉపసర్పంచ్ కాసుగోని మమత బాలకృష్ణ తన సొంత నిధులతో బస్టాండ్‌లో మరమ్మతులు చేయించారు. గుంతల కారణంగా ప్రయాణికు లు, ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి ఈ చర్య చేపట్టారు. గతం లో రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా బస్టాండ్ పక్కన డ్రైనేజీ కాలువలు నిర్మించడం తో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. బస్టాం డ్‌లో గుంతలు ఏర్పడటంతో ప్రయాణికు లు అవస్థలు పడుతున్న విషయాన్ని గుర్తించిన ఉపసర్పంచ్ మమత బాలకృష్ణ స్వయంగా స్పందించి మరమ్మతులు చేయిం చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందించిన ఆమెను స్థానికులు అభినం దిస్తున్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

బాలా త్రిపురసుందరీ దేవిగా అమ్మవారి దర్శనం. ధ్వజారోహణలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, (సింగిడి): నగరంలోని శ్రీ మహాశక్తి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమ య్యాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. తొలిరోజు అమ్మవా రు బాలా త్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, వేలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకు న్నారు. భవానీ దీక్షాపరులు, భక్తులకు ఆలయ నిర్వాహకులు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేశారు. నవరాత్రులు ముగిసే వరకు ఈ సేవలు కొనసా గనున్నా యి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం బ్రహ్మశ్రీ డాక్టర్ గరైపల్లి మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో 'శ్రీ భాగవత వైభవం'పై ప్రవచనాలు నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా భక్తి గీతాలతో దాండియా కార్యక్రమం. నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం 13-10-2026

ప్రమాద బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం

చెంచు రాజు కుటుంబానికి లెగసీ యూత్ అసోసియేషన్ అండ



నల్లబెల్లి,(సింగిడి):ఇటీవల జరిగిన ప్రమా దంలో మృతి చెందిన చెంచు రాజు కుటుంబాన్ని నల్లబెల్లి మండలం పంతులుపల్లికి చెందిన లెగసీ యూత్ అసోసి యేషన్ సభ్యులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో అసోసియేషన్ తరఫున రూ.5,000 ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం సామాజిక బాధ్యతగా,భావి స్తున్నామని తెలిపారు. చెంచు రాజు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన లెగసీ యూత్ అసోసియేషన్ సభ్యులను పలువురు అభినందించారు.

ఫీడ్‌బ్యాక్ పేరుతో ఇంటింటికీ క్యాంపెయినింగ్..?

దసరా సెలవుల్లోనూ వర్కింగ్ డే..
మాస్టర్ మైండ్స్ పాఠశాల తీరుపై ప్రశ్నలు

హన్మకొండ,(సింగిడి): విద్యార్థులకు దసరా సెలవులు ప్రకటించినప్పటికీ హన్మకొండ పట్టణంలోని మాస్టర్ మైండ్స్ పాఠశాల ఉపాధ్యాయులకు మాత్రం సెలవులు లేనట్టుగా కనిపిస్తోంది. ఫీడ్‌బ్యాక్ సేకరణ పేరుతో ఉపాధ్యాయులను పట్టణంలోని పలు వీధుల్లో ఇంటింటికీ తిప్పుతూ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనే విషయం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా పాఠశాల ప్రారంభానికి ముందు నిర్వహించే ప్రచార కార్యక్రమాలను, ప్రస్తుతం దసరా సెలవుల సమయంలో ఫీడ్‌బ్యాక్ పేరుతో నిర్వహించడం గమనార్హం. సెలవు రోజుల్లో ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ విశ్రాంతి తీసుకోవాల్సి ఉండగా,వారిని ఇంటింటికీ పంపించి పాఠశాల ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు పాఠశాలకు వెళ్లగా ప్రిన్సిపల్ అందుబాటులో లేరు. అనంతరం ఫోన్‌లో సంప్రదించి వివరణ కోరగా, తాను అందుబాటులో లేనని ప్రిన్సిపల్ సమాధానమిచ్చారు. అయితే, ప్రిన్సిపల్ సైతం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు సమాచారం ఉంది. ఈ విషయాన్ని మండల విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లగా, సెలవు దినాల్లో ఉపాధ్యాయులతో ఇలాంటి కార్యక్రమాలు



నిర్వహించడం సరైన పద్ధతి కాదని ఆమె తెలిపారు. ఈ అంశంపై పాఠశాల యాజమాన్యంతో మాట్లాడినట్లు వెల్లడించారు. ఫీడ్‌బ్యాక్ సేకరణ పాఠశాల నిర్వహణలో భాగమైనప్పటికీ, అందుకోసం ఉపాధ్యాయుల సెలవు సమయాన్ని వినియోగించుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయుల శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు వారి వ్యక్తిగత సమయాన్ని, విశ్రాంతిని గౌరవించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యాల పై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి, సెలవు రోజుల్లో ఉపాధ్యాయులతో విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని పలువురు కోరుతున్నారు. అవసరమైతే కార్మిక శాఖ అధికారులు సైతం నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని పరిశీలించాలని అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులకు సెలవులు ప్రకటించిన సమయంలో ఉపాధ్యాయుల విశ్రాంతి, పని పరిస్థితులకు సంబంధించిన నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. సెలవుల సమయంలో ఫీడ్‌బ్యాక్ పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం వెనుక పాఠశాల యాజమాన్యం ఉద్దేశం ఏమిటి? ఉపాధ్యాయులకు నిజంగా సెలవులు కల్పించారా? మండల విద్యాధికారి యాజమాన్యంతో మాట్లాడిన నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం తన వైఖరిని మార్చుకుంటుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

ప్రమాదాల నివారణే లక్ష్యం..
రహదారి భద్రతకు ఎస్సై శ్రీకాంత్ చర్యలు







రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు..
రాకపోకలకు ఆటంకాలు లేకుండా చర్యలు

బుగ్గారం, (సింగిడి):రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు వాహనదారులు, ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా బుగ్గారం ఎస్సై ఎస్. శ్రీకాంత్ చర్యలు చేపట్టారు. బుగ్గారం క్రాస్‌రోడ్డు నుంచి మండల కేంద్రంలోకి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించడంతో పాటు, రహదారికి అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించే చర్యలు చేపట్టారు.రహదారిపై చెట్లు, కొమ్మలు అడ్డుగా ఉండటంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండటమే కాకుండా, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని గుర్తించి ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రహదారిపై ఎదురెదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా, రాకపోకలు సాఫీగా సాగేందుకు వీలుగా మార్గాన్ని సురక్షితంగా తీర్చిదిద్దుతున్నారు.పోలీసుల విధులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా స్పందిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రహదారి భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఎస్సై శ్రీకాంత్ చేపట్టిన చర్యలతో వాహనదారులకు మరింత సౌకర్యం కలగనుంది

గౌడ యూత్‌కు కొత్త సారథ్యం

అధ్యక్షుడిగా పంజాల నాగరాజు ఎన్నిక..
సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు కృషి



జమ్మికుంట (సింగిడి): హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామం లోని గౌడ (కొండిన్య) యూత్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పంజాల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా పంజాల అరవింద్, ఉపాధ్యక్షులుగా పంజాల నవీన్, కోశాధికారిగా పంజాల శివ ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా సుమంత్, కార్యదర్శులుగా కుమార్, తరుణ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. గౌడ యూత్ అభివృద్ధికి ఐకమత్యంతో కృషి చేస్తామని తెలిపారు. యువతను సంఘటితం చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటామని పేర్కొన్నారు. గౌడ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాల సాధనకు కృషి చేస్తామని వెల్లడించారు. చెల్పూర్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని స్పష్టం చేశారు.

దాతల సహకారంతో
మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం



వెంకటాపురం సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొండ యాకన్న గౌడ్

తొర్రూరు, (సింగిడి): తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో వెంకటాపురం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బతుకమ్మ పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొండ యాకన్న గౌడ్ తెలిపారు.తొర్రూరు మండలం వెంకటాపురం గ్రామంలో ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ బతుకమ్మలుగా ఎంపికైన కొయ్యేటి భవాని, నలమాస లక్ష్మీకాంత, వంగ సుమలతలకు నగదు బహుమతులను కొండ యాకన్న గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్‌కు ప్రతినెలా దాతలు అందిస్తున్న



సహకారంతో గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారని పేర్కొన్నారు. గ్రామంలో ఏన్నో సంవత్సరాలుగా ట్రస్ట్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు దాతలు సేవాభావంతో ముందుకు రావాలని కోరారు. ట్రస్ట్‌కు ప్రతినెలా సహకారం అందిస్తున్న దాతలకు గ్రామ ప్రజల తరఫున, ట్రస్ట్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెట్టి అశోక్, జలగం యాకయ్య, బోలగాని శోభన్ బాబు, ట్రస్ట్‌సభ్యులు, గ్రామ మహిళలు, పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ



ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

– పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి

తొర్రూరు, (సింగిడి): తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సంప్రదాయాలకు, ప్రకృతి ఆరాధనకు బతుక మ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందనిపాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి, వేటా (ఉమెన్ ఎంపవర్‌మెంట్‌ఆఫ్ తెలుగు అసోసియేషన్) అధ్యక్షురాలు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హను మాండ్లఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు.తొర్రూరు మున్సిపల్ ఆధ్వర్యంలో, వేటా--ఇండియా అనుసంధానంతో శనివారం తొర్రూరు పెద్ద చెరువు సమీపంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యశస్వినీ





రెడ్డి, ఝాన్సీ రాజేందర్ రెడ్డి హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ పండుగ నుపురస్కరించుకుని మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగాపేర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మపాటలు పాడుతూ ఆటపాటలతోవేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళల కోలాహలంతో తొర్రూరు పెద్దచెరువు పరిసరాలు పండుగ శోభను సంతరిం చుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కుందనితెలిపారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం మహిళల్లో ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్నిభావితరాలకు అందిస్తుందని పేర్కొన్నారు.మహి ళల సాధికారత, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపు నిచ్చారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పలుసంక్షేమ కార్యక్ర మాలను అమలు చేస్తోందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో బతుకమ్మ వంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, పట్టణ వార్డు కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి, సీనియర్ నాయకులు చాపల బాపురెడ్డి, పెదగాని కళావతి సోమయ్య, బసనబోయిన ఐలమ్మ, జాటోత్ భద్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ చోరీ ఆరోపణలకు ఆధారాలేవి?

కాంగ్రెస్ తప్పుడు ప్రచారం మానుకోవాలి: బీజేపీ నేతలు

జమ్మికుంట, (సింగిడి):ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపాలని బీజేపీ హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, మండల అధ్యక్షుడు పారుపల్లి కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు.ఆదివారం హుజురాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం మానుకో వాలని హితవు పలికారు. ఓటరు జాబితాలను పారదర్శకంగా ప్రక్షాళన చేసేందుకే ఎస్ఐఆర్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.ఎన్నికల ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేసే ముందు



కాంగ్రెస్ నాయకులు తమ ఆరోపణలకు నిర్దిష్ట ఆధారాలు చూపించాలని అన్నారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా పోరాడి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముప్పు మహేష్, తూముల శ్రీనివాస్, గంగిశెట్టి రాజు, తిప్పబత్తిని రాజు, గంట సంపత్, అంకటి వాసు, రావుల పూర్ణం చందర్, పోచంపల్లి సహదేవ్, పెరుమాళ్ల దేవగౌడ్, పెరుమాళ్ల కోటి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న సంద్ర కలప పట్టివేత

– మరిపెడ పోలీసుల పెట్రోలింగ్‌లో పట్టుబడిన మహీంద్రా ట్రాక్టర్



డోర్నకల్ /మరిపెడ (సింగిడి):మరిపెడ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అనేపురం--గిరిపురం రోడ్డుపై అక్రమంగా తరలిస్తున్న సంద్ర కలపను పట్టుకున్నారు.ఎలాంటి అనుమతులు లేకుండా సూర్యాపేటకు మహీంద్రా ట్రాక్టర్‌లో సంద్ర కలపను తరలిస్తుండగా పోలీసులు గుర్తించి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనలో సూర్యాపేట జిల్లాకు చెందిన గుగులోత్ రమేష్, దారావత్ సాయిలను నిందితులుగా గుర్తించారు. అనంతరం పట్టుబడిన ట్రాక్టర్‌తో పాటు సంద్ర కలపను తదుపరి చర్యల నిమిత్తం అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

పిట్టల దొర (తుపాకీ రాముడు) వేషంలో..
సామాజిక చైతన్యానికి శ్రీకారం!

– పిట్టల దొరగా రాచకొండ ప్రభాకర్ వినూత్న ప్రచారం

– గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

– రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

డోర్నకల్/మరిపెడ (సింగిడి): పిట్టల దొర వేషం.. (తుపాకీ రాముడి రూపం..) హాస్యంతో కూడిన మా టలు.. ఆలోచింపజేసే సందేశాలు! ఇలా తనదైన శైలిలో ప్రజల్లో సామాజిక చైత న్యం చేస్తున్నారు.సూర్యాపేట జిల్లా మద్ది రాల మండలం గోరెంట్ల లో తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్. సాధారణంగా వినోదాన్ని పంచే పిట్టల దొర వేషధారణకు సామాజిక బాధ్యతను జోడించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని సందేశమి స్తున్నారు. అదే సమయంలో రోడ్డు ప్రమా దాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయా లని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని పిలుపునిస్తు న్నారు. ఆదివారం నవ్విస్తూనే.. ఆలోచింపజేస్తూ! సాధారణంగా పిట్టలు దొర దసరా పండు గ సందర్భంగా గ్రామాల్లో తన మాటల్లో గారడీతో నవ్వులు పూయిస్తూ ఎంతో కొం త యాచిస్తాడు.కానీ ఇక్కడ మాత్రం.. డ్రగ్స్, గంజాయి నివారణ మరియు రోడ్డు భద్రత పై ఆలోచించే విధంగా..ఆదివారం



మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా వార సంతలో సందేశాత్మకం గా..వినో దాత్మక వేషధారణతో ప్రజలను ఆకట్టు కుంటూ,సామాజిక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడమే ఈ ప్రయత్నంలోని ప్రత్యేకత. మాటల్లో హాస్యం ఉన్నా.. సందే శంలో సామాజిక బాధ్యత కనిపిస్తోంది. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుం డా, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతకు ప్రాధా న్యమిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నదే ఈ ప్రచారం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.వినోదం ఒక ఆకర్షణ.. అవగాహన అసలు లక్ష్యం! పిట్టల దొర వేషంలో రాచకొండ ప్రభాకర్ చేస్తున్న ఈ ప్రయత్నం ప్రజల్లో మంచి మార్పునకు దోహదపడాలని ఆశిద్దాం.

నిరసన హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం

జంతర్ మంతర్ వద్ద వామపక్షాల నిరసనకు అనుమతి నిరాకరణపై ఏఐఎఫ్‌బీ నేత అంబటి జోజిరెడ్డి ఖండన,

కరీంనగర్,(సింగిడి):ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వామపక్ష నేత లు చేపట్టనున్న నిరసనకు కేంద్ర ప్రభు త్వం అనుమతి నిరాకరించడాన్ని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజిరెడ్డి తీవ్రంగా ఖం డించారు.ప్రజాస్వామ్యం లో నిరసన తెలి పే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ప్రజా సమస్యలపై గళమెత్తేవా రిని అడ్డుకో వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.ప్రజల సమస్యల ను ప్రభుత్వం



దృష్టికి తీసుకె ళ్లేందుకు నిరసనలు కీలక మైన ప్రజా స్వామ్య మార్గా లని, వాటి పై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నా రు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రజల్లో నెలకొ న్న సందే హాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయాలని కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవా లని, అభ్యంతరాలను సమగ్రంగా పరిశీ లించి, సవరణ ప్రక్రియను పారదర్శ కంగా నిర్వహించాలని సూచించా రు.ఓటు హక్కు ప్రజాస్వా మ్యానికి పునాది అని, ప్రతి అర్హుడికీ ఆ హక్కు అందేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రజా స్వామ్య హక్కుల పరిరక్షణకు అన్ని ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ నిరంతరం కృషి చేస్తుందని అంబటి జోజిరెడ్డి స్పష్టం చేశారు.

మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన
పీఏసీఎస్ చైర్మన్, ఇప్ప మొండయ్య

మల్హర్, (సింగిడి):మల్హర్ మండలం పెద్దతుండ్ల గ్రామానికి చెందిన బోగే ఓదెలు మృతి చెందడంతో, ఆయన పదో రోజు కార్యక్రమం సందర్భంగా కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయాన్ని ఆయన కుమారుడు బోగే బాపుకు అందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, వార్డు సభ్యులు బండ విష్ణు వర్ధన్ రెడ్డి, సబ్బిడి రమణ రెడ్డి, బానోత్ కిషన్ నాయక్, జక్కుల వెంకటస్వామి, నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం | Singidi | మంగళవారం 13-10-2026

ఉద్యమ నేతలకు ఘన సన్మానం

కామారెడ్డి జిల్లా ఆవిర్భావ దశాబ్ది సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం



బిక్కనూర్,(సింగిడి):కామారెడ్డి జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా భిక్కనూర్ మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకులను ఘనంగా సన్మానిం చారు. కామారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన బీఆర్ఎస్ ఉద్యమ నాయకుల సేవలను గుర్తు చేసుకుంటూ వారిని సత్కరించారు. ఈ సందర్భంగా భిక్కనూర్ మండలానికి చెందిన అందె మహేందర్ రెడ్డి, తక్కళ్ల నరేందర్ రెడ్డి, వంగేటి నర్సారెడ్డి, ఏనుగు రాజిరెడ్డి, వల్లకొండ సురేందర్ రెడ్డి, వడ్ల బ్రహ్మచారి, దేవరాజులను సన్మానించారు.కామారెడ్డి జిల్లా ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, హనుమంత్ షిండే, ముజీబొద్దీన్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భిక్కనూర్ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నా

ఘనంగా వాసవి క్లబ్స్ జోన్ సోషల్ వేడుకలు

ఆరు క్లబ్ ల ప్రతినిధులకు సత్కారాలు..
సేవా కార్యక్రమాలకు ప్రశంసలు
వాసవి సేవా స్ఫూర్తిని చాటిన జోన్ సోషల్

జమ్మికుంట, (సింగిడి): వాసవి క్లబ్స్ జోన్--2 ఆధ్వర్యంలో జోన్ చైర్‌పర్సన్ వీఎన్ కేజీసీఎఫ్ అయితు శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జోన్ సోషల్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వైస్ గవర్నర్--1 వీఎన్ కేజీసీఎఫ్ తంగళ్లపల్లి రాజభాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై సభ్యులకు దిశానిర్దేశం చేశారు.కార్యక్రమంలో ముఖ్య అతిథి వీసీఐ అధికారిక జెండాను ఆవిష్కరించగా, జోన్ చైర్ పర్సన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జోన్ ప్రథమ మహిళ అయితు అనూష జ్యోతి ప్రజ్వలన చేసి వాసవీమాత ప్రార్థన నిర్వహించారు.అనంతరం సభ్యులందరి తో ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ, స్వర్గస్తులైన వాసవీయన్ల ఆత్మశాంతి కోసం ఒక నిమిషం మౌనం పాటించారు. ముఖ్య అతిథికి జాతీయ జెండాను, జోన్ చైర్ పర్సన్‌కు వాసవీ మాత జెండాను అందజేశారు.హోస్ట్ క్లబ్ వాసవి క్లబ్ జమ్మికుంట అధ్యక్షుడు వీఎన్ కేజీసీఎఫ్ గుడివాడ వెంకట సతీష్ స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమానికి ఐపీసీ గంప సురేందర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. వీఎన్ కేజీసీఎఫ్ ఆకినపల్లి శ్రీనివాస్ జోన్ చైర్ పర్సన్‌ను పరిచయం చేయగా, వీ ఎన్ సుద్దాల శ్రీనివాస్ ముఖ్య అతిథిని సభకు పరిచయం చేశారు. అనంతరం జోన్ చైర్ పర్సన్ అయితు శ్రీనివాస్, ముఖ్య అతిథి తంగళ్లపల్లి రాజ భాస్కర్ తమ సందేశాల ద్వారా సభ్యులకు సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు.

క్లబ్ ప్రతినిధులకు అవార్డులు.. అధికారులకు సన్మానాలు



జోన్ పరిధిలోని క్లబ్బులు తమ బ్యానర్ ప్రజెంటేషన్ల ను నిర్వహించి, చేపట్టిన కార్యక్రమాలను వివరించాయి. ఆయా క్లబ్బుల పీఎస్‌టీలను ముఖ్య అతిథి, జోన్ చైర్‌పర్సన్ శాలువాలతో సత్కరించి అవార్డులు అందజేశారు. ముఖ్య అతిథి తంగళ్లపల్లి రాజభాస్కర్‌ను ఘనంగా సన్మానించి మెమెంటో, బహుమతిని అందించారు. జిల్లా స్థాయి అధికారులను సైతం సత్కరించారు.ఈ సందర్భంగా జిల్లా వైస్ గవర్నర్ తంగళ్లపల్లి రాజ భాస్కర్, జిల్లా క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ లు ఆకినపల్లి శ్రీనివాస్, సుద్దాల శ్రీనివాస్, గోసేవ కోఆర్డినేటర్ రావికంటి నీలకంఠం, జిల్లా సీఎంఆర్ ఇన్‌చార్జి రావికంటి మధుబాబు తదితరులు జోన్ పరిధిలోని క్లబ్బులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. వాసవి క్లబ్స్ ద్వారా సమాజ సేవ, ఐకమత్యం, సేవా భావాన్ని మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.



ఆరు క్లబ్‌ల సభ్యుల సందడి

ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జమ్మికుంట, వీకేఎస్‌పీ క్లబ్ జమ్మికుంట, వాసవి క్లబ్ ఇల్లంతకుంట, వాసవి వనిత క్లబ్ ఇల్లంతకుంట, వాసవి క్లబ్ ఓదెల, వైష్ణవి వాసవి వనిత క్లబ్ ఓదెల కు చెందిన పీఎస్‌టీలు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరస్పర పరిచయాలు, సత్కారాలు, సేవా కార్యక్రమాల సమీక్ష తో జోన్ సోషల్ వేడుకలు ఉత్సాహ భరిత వాతావరణంలో ముగిశాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హోస్ట్ క్లబ్ వాసవి క్లబ్ జమ్మికుంట ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్‌ది
అనవసర రాద్ధాంతం

నకిలీ, మరణించిన వారి ఓట్లను తొలగించవద్దా? అని ప్రశ్నించిన,
బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కల్యాణ్ చంద్ర



కరీంనగర్, (సింగిడి):ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కల్యాణ్ చంద్ర విమర్శించారు. తిమ్మాపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నకిలీ ఓట్లు, మర ణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించకూడదా అని ప్రశ్నిం చారు.ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గతంలోనూ ఎన్నికల సంఘం పలు దఫాలుగా ఈ ప్రక్రియను నిర్వహించిందని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాస్పదం చేయడం సరికాదన్నారు.ఓట్ల చోరీపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఖండించిన ఆయన, ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు. ఓటర్లలో అనవసర భయాందోళనలు సృష్టించకుండా, ఎస్ఐఆర్ ప్రక్రియపై తప్పుడు ప్రచారాన్ని విడనాడాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, ఓదెలు, బుర్ర శ్రీనివాస్ గౌడ్, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి శ్రీకారం

అక్టోబర్ 17న పనుల ప్రారంభం. పది ఎకరాల్లో ఏ
తిరుమల ఆలయ నమూనాలో నిర్మాణం
మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, (సింగిడి):నగరంలోని పద్మనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు అక్టోబర్ 17న ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. ఆదివారం టీటీడీ అధికారులతో కలిసి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, పనుల ప్రారంభ ఏర్పాట్లపై చర్చించారు.ఆలయ నిర్మాణానికి గతంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో టీటీడీ అనుమతులు పొందినట్లు గంగుల తెలిపారు. పద్మనగర్‌లో పది ఎకరాల భూమిని టీటీడీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించామని, 2023 మే 31న



భూమిపూజ నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం చేపట్టిన నిర్మాణ ప్రక్రియ ఎన్నికల కారణంగా ఆలస్యమైందని వివరించారు.అక్టోబర్ 17న మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం తొమ్మిది గంటలలోపు పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. తిరుమల ఆలయాన్ని తలపించేలా ప్రధాన ద్వారం, గర్భాలయం, అర్థమండపం, ముఖమండపం, గరుడాళ్వార్ నిర్మాణాలతో సంప్రదాయ శైలిలో ఆలయాన్ని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.ఆలయ నిర్మాణం పూర్తయితే కరీంనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల భక్తులకు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం మరింత చేరువవుతుందని గంగుల కమలాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ మేయర్ రవీందర్ సింగ్, నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరిశంకర్,మాజీ కొత్తపల్లి మునిసిపల్ చైర్మన్ రుద్ర రాజు, శ్రీకాంత్, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయొద్దు..

ఆధునిక చికిత్సతో మెరుగైన జీవన ప్రమాణాలు, 150కి పైగా
రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహించిన అనుభవం.
కరీంనగర్‌లో అవగాహన సదస్సులో కిమ్స్ ఆసుపత్రి
ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు
డాక్టర్ సాయి ఫణి చంద్ర

కరీంనగర్, (సింగిడి):మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి చెందిన ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు డాక్టర్ సాయి ఫణి చంద్ర సూచించారు. ఆధునిక చికిత్సా విధానాలతో కీళ్ల సమస్యలను నియంత్రించి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు.ప్రపంచ కీళ్లవాతం దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని శ్వేతా సాయి ఫణి క్లినిక్‌లో కీళ్ల ఆరోగ్యం, మోకాళ్ల నొప్పులు, ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వయస్సు పెరగడం, కీళ్ల అరుగుదల వంటి కారణాలతో నడవడం, మెట్లు ఎక్కడం, రోజువారీ పనులు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు.కీళ్ల నొప్పులు ఉన్నప్రతి ఒక్కరికీ శస్త్రచికిత్స అవసరం లేదని, రోగి ఆరోగ్యపరిస్థితిని బట్టి మందులు, వ్యాయామం, భౌతిక చికిత్స లేదా అవసరమైన సందర్భాల్లో



శస్త్రచికిత్సను సూచిస్తారని తెలిపారు. కీళ్ల అరుగుదల తీవ్రంగా ఉన్నవారికి రోబోటిక్ సహాయక కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స ఆధునిక చికిత్సా ఎంపికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.డాక్టర్ సాయి ఫణి చంద్రకు 150కి పైగా రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహించిన అనుభవం ఉందని నిర్వాహకులు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచనలు పాటించడం, అవసరమైన భౌతిక చికిత్స చేయించుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయకుండా నిపుణుల సలహాతో తగిన చికిత్స పొందాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశం లో శ్వేతా సాయి ఫణి క్లినిక్ నిర్వాహకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాటారం మండలంలో
శరన్నవరాత్రి ఉత్సవాల సందడి

గ్రామగ్రామాన ఘనంగా పూజలు..
ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించిన భక్తులు

కాటారం, (సింగిడి):కాటారం మండలంలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. కాటారం మండలంలోని గారేపల్లి లోని ఆర్యవైశ్య సంఘం, లక్ష్మీదేవర ఆలయం , ఎర్రగుంటపల్లి, చింతకాని, గూడూరులోని ధన్వాడ గ్రామాల్లోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవా లను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రూపా ల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించు కుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాల్లో భక్తుల సహకారంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.



ఆలయానికి షూస్‌తో వెళ్లడంపై
సర్పంచ్‌పై విమర్శలు!

కోరపల్లి శివాలయంలో ఘటనపై గ్రామస్తుల అభ్యంతరం
దైవాన్ని అవమానించడం క్షమించరాని నేరం
ఫిషర్ మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిలి రాకేష్

జమ్మికుంట, (సింగిడి):మం డలంలోని కోరపల్లి గ్రామానికి ప్రథమ పౌరుడిగా ఉండాల్సిన సర్పంచ్.. ప్రజల ఆచారాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత లేదా? అంటూ కోరపల్లి సర్పంచ్ కందికట్ల మధుసూధన్‌పై ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిలి రాకేష్ ముదిరాజ్‌తో పాటు పలువురు గ్రామస్థులు విమర్శలు వ్యక్తం చేశారు. కోరపల్లి శివాలయానికి సర్పంచ్ షూస్‌తో వెళ్లడంపై వారు అభ్యంతరం తెలిపారు.ఆలయాలు భక్తి,



ఆధ్యాత్మికతకు ప్రతీకలని, అటువంటి పవిత్ర ప్రదేశాలకు వెళ్లేటప్పుడు అక్కడి ఆచారాలు, సంప్రదాయాలను గౌరవించాలని రాకేష్ పేర్కొన్నారు. గ్రామానికి నాయకత్వం వహించే వ్యక్తి తన ప్రవర్తనతో ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.పదవి హోదా మాత్రమే కాదు.. బాధ్యతాయుత ప్రవర్తన కూడా ముఖ్యమేనని, గ్రామ ప్రథమ పౌరుడిగా సర్పంచ్ వ్యవహారశైలి ప్రజలకు ఆదర్శంగా ఉండాలని వారు అభిప్రాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

తక్కువ పెట్టుబడితో
అధిక దిగుబడులు సాధించాలి

నాథ్ సంకేత్ బీజీ-2 పత్తి రకంతో రైతులకు లాభాలు

కాటారం,(సింగిడి):తక్కువ పెట్టుబ డితో అధిక దిగుబడులు సా ధించి రైతులు లాభాలు పొం దాలని నాథ్ బయో-జీన్స్ ఇండియా లిమిటెడ్ మార్కెట్ ఆఫీసర్ ఇప్పలపల్లి దేవేందర్ అన్నారు. మండలంలోని గుమ్మలపల్లిగ్రామానికి చెందిన రైతు కంకణాల సురేందర్ రెడ్డి పత్తి చేనులో ఆదివారం నాథ్ బయో-జీన్స్ ఇం



డియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వ ర్యంలో నాథ్ సంకేత్ బీజీ-2 పత్తి రకంపై రైతులకు పంట ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ నాథ్ సంకేత్ బీజీ-2 హైబ్రిడ్ పత్తి రకం మంచి దిగుబడినిచ్చిందని తెలిపారు. ఈ రకం గులాబీ రంగు పురుగు, రసం పీల్చే పురుగుల ప్రభావాన్ని తట్టుకునే లక్షణాలతో రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ పత్తి రకాన్ని సాగు చేయడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు సాధించి ఆర్థికంగా లాభపడవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కంపెనీ డిస్ట్రిబ్యూటర్ బొమ్మ సమ్మిరెడ్డి, డీలర్ పోటు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నా

చిన్నారి రిషికి అండగా న్యాయసేవాధికార సంస్థ

శిశుగృహంలో కంటి సమస్య గుర్తింపు,
న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి యశ్వంత్ సింగ్
చొరవతో విజయవంతంగా శస్త్రచికిత్స,

కరీంనగర్, (సింగిడి):కుటుంబ ఆదరణకు దూరమైన ఆరు నెలల చిన్నారి రిషికి మెరుగైన వైద్యం అందించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన పర్యవేక్షణలో హైదరాబాద్‌లోని ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రిలో చిన్నారికి కుడి కంటికి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని ఊయలలో వదిలివేయబడిన రిషిని సెప్టెంబర్ 2న శిశుగృహంలో చేర్చారు. సెప్టెంబర్ 18న శిశుగృహం, బాలసదన్‌ను తనిఖీ చేసిన యశ్వంత్ సింగ్.. చిన్నారి నిరంతరం ఏడుస్తుండటాన్ని గమనించి, కారణాలను ఆరా తీశారు. కంటి సమస్య ఉన్నట్లు సిబ్బంది తెలపడంతో వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు.కరీంనగర్‌లో నిర్వహించిన పరీక్షల్లో రెండు కళ్లకు సంబంధించిన సమస్య ఉన్నట్లు గుర్తించడంతో, వైద్యుల సూచన మేరకు అక్టోబర్ 3న చిన్నారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడి ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించిన అనంతరం అక్టోబర్ 7న కుడి కంటికి శస్త్రచికిత్స చేశారు. అక్టోబర్ 8న వైద్య సమీక్ష పూర్తయ్యాక చిన్నారిని తిరిగి కరీంనగర్ శిశుగృహానికి తీసుకొచ్చారు. వారం రోజుల తర్వాత మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించి, ఎడమ



కంటికి తదుపరి చికిత్సపై నిర్ణయం తీసుకోనున్నారు.

ఇతర పిల్లల ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ...

రిషి చికిత్సతో పాటు శిశుగృహం, బాలసదన్‌లోని ఇతర పిల్లల ఆరోగ్య పరిస్థితులపైనా యశ్వంత్ సింగ్ దృష్టి సారిస్తున్నారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి పర్వీన్, శిశుగృహం నిర్వాహకురాలు అపూర్వతో సమన్వయం చేసుకుంటూ పిల్లలకు అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపడుతున్నారు. బాలల ఆరోగ్యం, భద్రత, హక్కుల పరిరక్షణలో న్యాయసేవాధికార సంస్థ పాత్ర కీలకమని ఈ ఘటన చాటిచెబుతోంది. సంరక్షణ అవసరమైన చిన్నారులకు మెరుగైన వైద్యంతో పాటు ప్రేమ, భరోసా కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత, అన్నారు.

అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లే!

దుర్గామాత ఆగమన్ వేడుకల్లో పాల్గొన్న
మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్



జమ్మికుంట,(సింగిడి): అమ్మవారి ఆశీ స్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయు రారోగ్యాలతో వర్ధిల్లాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ఆకాంక్షించారు. జమ్మికుంటలో నిర్వహించిన శ్రీ దుర్గామాత ఆగమన్ వేడు కల్లో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, దుర్గామాత కృపతో ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని అన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో యువత భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. నేటి యువతలో ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి పెరుగుతుండటం శుభపరిణామమని పేర్కొన్నారు.దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఐక్యత, సోదరభావానికి ప్రతీకలని పేర్కొంటూ, ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, పరస్పర సౌభ్రాతృత్వంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. అమ్మవారి కృపాకటాక్షాలు పట్టణ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

అనుమతి లేని వాహనాలపై పోలీసుల ఉక్కుపాదం

వీణవంక, కొండపాక లో కార్డన్ సెర్చ్..
ఏసీపీ మాధవి పర్యవేక్షణలో తనిఖీలు

జమ్మికుంట, (సింగిడి):మండలం లోని వీణవంక, కొండపాక గ్రామాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్‌తో పాటు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి పర్యవేక్షణలో ఎస్సై ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల గుర్తింపే లక్ష్యంగా తనిఖీలు చేపట్టారు. వీణ వంకలో 13 ద్విచక్ర వాహ నాలు, 22 ట్రాలీలతో పాటు పలు వాహ నాలను పరిశీలించారు. కొండపా కలో 40 ద్విచక్ర వాహనా లు, ఒక టాటా ఏస్, ఒక ఇసుక ట్రాక్టర్, రెండు ట్రాక్టర్లు, ఒక ఆటో సహా మొత్తం 45 వాహనాలను తనిఖీ చేశారు.నిబంధనలకు విరు ద్ధంగా ఉన్న వాహనాలపై జరిమానాలు విధించడంతో పాటు కొన్ని వాహనాలను సీజ్ చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, గ్రామాల్లో అనుమా నాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసు లకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఈ తనిఖీల్లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, సీఐ పులి వెంకట్, వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి శంకరపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి తో పాటు హుజూరాబాద్, జమ్మికుంట, శంకరపట్నం, సైదాపూర్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.



అర్ధరాత్రి ఇళ్ల కూల్చివేత దుర్మార్గం

బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణ రెడ్డి

అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న పేదలకు తీవ్ర నష్టం
నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ
కల్పించాలని డిమాండ్

మల్హర్, (సింగిడి):తాడిచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని శత్రాజ్‌పల్లిలో నిరుపేదల ఇళ్ల కూల్చివేత దుర్మార్గమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్లా నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అర్ధరాత్రి సమయంలో ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఇంట్లోని సామగ్రిని బయటకు తీసుకునే అవకాశం కల్పించకుండా ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని ఆయన విమర్శించారు. పేదలు తమ రెక్కల కష్టంతో పాటు అప్పులు చేసి, బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి ఒక్కొ ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల నుంచి రూ. 4. 5 లక్షల వరకు ఖర్చు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల కూల్చివేతతో బాధిత కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు.గతంలో భూపాలపల్లిలో ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు బాధితులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకున్నారని గుర్తుచేస్తూ, ఇక్కడి



బాధితుల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు.బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, అర్హులకు నష్టపరిహారంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చల్లా నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండా శ్రీకాంత్‌తో పాటు పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్, నిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ చైర్మన్‌ను సన్మానించిన విశ్వబ్రాహ్మణ మహాసభ



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన మేనేజింగ్ కమిటీకి ఎన్నిక అయింది. ఆ సందర్భంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పోతాన్కర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి కెంపుల నాగరాజు ను నగరం లోని ఆదివారం ఓ ప్రవేటు కార్యాలయం లో అఖిల భారత విశ్వబ్రాహ్మణ మహాసభ నిజామాబాద్ జిల్లా శాఖ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అఖిల భారత విశ్వబ్రాహ్మణ మహాసభ మహిళా అధ్యక్షురాలు మడుపు స్వప్న మాట్లాడుతూ జిల్లా ప్రజలకు రక్తదాన సేవ కార్యక్రమాలు మరింత విస్తరించే విధంగా,సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మి, విజయ, కోశాధికారి లత, వర్కింగ్ ప్రెసిడెంట్ కవిత, ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్యవర్గ సభ్యులు లత, చంద్రకళ, ముఖ్య సలహాదారు గీత,కార్యవర్గ సభ్యులు సదానందం తదితరులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు

ప్రత్యేక పూజలు నిర్వహించిన రాణా ప్రతాప్ దంపతులు



దుగ్గొండి, (సింగిడి): హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మనోహరమైన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టు కుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో పూజా ప్రాంగణం భక్తజన సందోహంతో కిటకిట లాడింది. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, నర్సంపేట నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల సందడితో పూజా ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలు హిందూ సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబిస్తూ భక్తుల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తున్నాయి. అమ్మవారి దివ్య అలంకరణ, భక్తుల విశేష హాజరుతో పూజా కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి.

చేవెళ్ల మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఈదులపల్లి రాములు

-నియామక పత్రం అందజేసిన జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ క్యారగారి శ్రీధర్. నియోజకవర్గం ఇంచార్జ్ ఫామేన భీమ్ భరత్.



చేవెళ్ల, (సింగిడి): చేవెళ్ల మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఈదులపల్లి రాములు నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ క్యారగారి శ్రీధర్, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఫామేన భీమ్ భరత్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈదులపల్లి రాములు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఎస్సీ వర్గాల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు, సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ మండలాల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ సర్కార్కు పతనం తప్పదు..

డిసిసి అధ్యక్షురాలు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి



అమనగల్లు, (సింగిడి): ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ రాజ్యాంగం మీద దాడి చేస్తున్న కేంద్రంలోని మోదీ సర్కార్కు పతనం తప్పదని డిసిసి అధ్యక్షురాలు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. దేశం లో బిజెపి ప్రభుత్వ ఓట్ల చోరీ పై ప్రజా తిరుగుబాటు మొదలు కావడంతో తట్టుకోలేక నిర్బంధ కాండ కొనసాగిస్తుందని ఆమె మండిపడ్డారు. ఆమన గల్లు పట్టణంలో ఆదివారం పారిజాత నర్సింహారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సర్ ను రద్దుచేసి సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనా చేయాలనే డిమాండ్ తో సోమవారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు రాహుల్ నేతృత్వంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి ప్రతి భారతీయుడు కలిసి రావాలని కోరారు. మహా ధర్నాకు జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు అంతా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. సర్ లో అక్రమాలు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలపై ప్రజా తిరుగుబాటును గ్రహించిన మోడీ సర్కారు అధికార బలాన్ని అడ్డుపెట్టుకొని పోలీసుల ద్వారా ఉక్కుపాదం మోపుతుందని పారిజాత నరసింహారెడ్డి మండిపడ్డారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసి సర్ ను రద్దు చేసే వరకు ఇండియా కూటమి పోరాటం కొనసాగిస్తుందని ఆమె ఉద్ఘాటించారు. ఓట్ల చోరీ ద్వారా మోడీ సర్కారు దేశంలో అధిపత్యం, అధికారం కొనసాగిస్తుందని ఆరోపించారు. దేశంలోని యువత కేంద్రంలోని మోడీ సర్కారు అవలంబిస్తున్న ఆప్రజాస్వామిక విధానాలపై తిరుగుబాటు చేసి అడ్డుకట్ట వేయాలని కోరారు.

విద్యుత్ కోసం సబ్‌స్టేషన్ల వద్ద రైతుల ఆందోళన

ఆర్మూర్, (సింగిడి): ఎలినినో ప్రభావం వల్ల సరైన వర్షాలు కురియాకపోవడం, బోరు బావుల పైనే ఆధారపడి నీరు ఉన్నరైతులు కొద్ది పంట సాగు చేసినప్పటికీ, ఆ పంట చేతికొచ్చిన సమయంలో ప్రభుత్వం గానీ,అధికారులు గానీ స్పందించి రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయకపోవడం వల్ల చేతికొచ్చిన పంటలు ఎండుకపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. చేసేదేమీ లేక అటు ప్రభుత్వము ఇటు అధికారులు స్పందించకపోవడంతో గత రెండు రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం ఎయిర్ గట్ల మండలంలోని తడపాకల్ సబ్ స్టేషన్ వద్ద భట్టాపూర్, తడపాకల్ గ్రామ రైతులు సబ్ స్టేషన్ ముందు ఎండను సైతం లెక్కచేయకుండా సబ్ స్టేషన్ ఇక్కడి నుంచి రైతులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. పంటలు పొట్ట దశలో ఉండగా కరెంటు కోతలతో పంటలు ఎండిపోతున్నాయని దీంతో రైతులు



నిరసన వ్యక్తం చేస్తూ మక్లూర్ మండల రైతులు రోడ్డుపై బైఠాయించి సబ్ స్టేషన్ ను ముట్టడించారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పరిధిలోని రైతులు మాట్లాడుతూ, ఎలినీ నో ప్రభావం వల్ల పంట సాగు విస్తీర్ణం తగ్గిందని, ఇలప్పటికీ కొద్దిపాటి పంట చేతికి వచ్చే తరుణంలో మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యంతో కరెంటు కోతల వలన పంటలు పొట్ట దశకు వచ్చిన సమయంలో ఎండిపోతున్నాయని రైతులు కన్నీరు మున్నీరు అయ్యారు. దీంతో వేసిన కొద్ది పంట చేతికి రాకపోతే ఆత్మహత్య శరణ్యమని రైతులు పేర్కొంటున్నారు కనీసం మరో 20 రోజులు నిరంతర విద్యుత్ అందిస్తే పంటలను కాపాడుకోగలుగుతామని రైతులు పేర్కొన్నారు. అధికారులు మాత్రం కరెంటు ఉత్పత్తి తగ్గడం వల్లనే కోతలు విధించాల్సిన అవసరం ఏర్పడిందని తెలియజేస్తూ తప్పించుకుంటున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని 20 రోజులపాటు విద్యుత్ సరఫరా అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, రాజేందర్, రత్నాకర్, భూషణ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ & వైస్ చైర్మన్ అప్పల కావ్య అప్పల గణేష్ చక్రవర్తి



నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): నిర్మల్ పట్టణంలోని బంగాల్పేట్ మహాలక్ష్మి ఆలయం వద్ద ఆదివారం దసరా నవరాత్రి ఉత్సవాలను మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం బంగాల్పేట్ మహాలక్ష్మి ఆలయం వద్ద దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. నిర్మల్ పట్టణంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రావణ దహన



కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. బంగాల్పేట్ యూత్, మహాలక్ష్మి ఆలయ కమిటీ, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా అవసరమైన భారీ గేట్లు, లైటింగ్ తదితర ఏర్పాట్లతో పాటు రావణ దహన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళపేట చెరువు కట్టపై అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు



పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో కార్యాచరణ రూపొందించి, అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ, బంగాల్పేట్ యూత్ సభ్యులతో కలిసి ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పెండం శ్రీనివాస్, లక్కాకుల హరీష్, శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల రాజు, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టింకు, బంగాల్పేట్ యూత్ అధ్యక్షుడు విక్కీ, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సంచల చోరీ కేసులో ఐదుగురి అరెస్టు

సాంకేతిక పరిజ్ఞానంతో 24గంటల్లోనే కేసు చేదించిన పోలీసులు.: పాత్రికేయుల సమావేశంలో వివరాలువెల్లడిస్తున్న.. సీఐ గోవర్ధన్ రెడ్డి..



సోన్, (సింగిడి):: సోన్ మండలం లోకల్ వెల్మల్ గ్రామంలో రైతుల మొక్కజొన్న పంట సంచులు చోరీకి పాల్పడిన ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు, సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి పాత్రికేయుల సమావేశాలో తెలిపారు. సందర్భంగా వీరు మాట్లాడుతూ ఆదివారం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గ్రామానికి పోశెట్టి, హరీష్, సాయన్నలు మొక్కజొన్న పంటను ఆరబెట్టి సంచుల్లో నింపి గ్రామంలో ఉంచారు. అయితే బైంసాకు చెందిన మహమ్మద్ ఆఫన్, మహమ్మద్ సాహిల్ ఉద్దీన్, నిర్మల్ పట్టణానికి చెందిన అకిఫ్ ఖాన్, మహమ్మద్ అజహార్, మహమ్మద్ జునైద్ కమల్ లు బైంసా పట్టణంలోని ఇఫ్తేకర్ అనే వ్యక్తి వద్ద టీఎస్ 18 టి 1942 బొలెరో వాహనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 7న రాత్రి సమయంలో లోకల్ వెల్మల్ గ్రామానికి వచ్చి ముగ్గురు రైతులకు చెందిన 76 మొక్కజొన్న సంచులను (38 క్వింటాళ్ల) ఎత్తుకెళ్లారు. చోరీ ఘటనపై రైతులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రైతులకు చెందిన పంట దొంగతనం కావడంతో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆదివారం దొంగతనం చేసిన మొక్కజొన్న సంచులను కామారెడ్డిలో విక్రయించేందుకు వెళుతున్న క్రమంలో మాదాపూర్ గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా బొలిరో వాహనం అనుమానంగా కనిపించింది. అందులో తనిఖీ చేయగా మొక్కజొన్న బస్తాలు కనిపించాయి. వారిని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. పోలీసులు చాకచక్యంగా సాంకేతిక పరిజ్ఞానంతో మొక్కజొన్న దొంగలను పట్టుకున్నందుకు జిల్లా ఎస్పీ జానకి షర్మిల పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్సై దేవన్న, పోలీస్ సిబ్బంది భాస్కర్, రాజ్ కుమార్, రవి, శ్రీనివాస్, వినోద్, సాయి కృష్ణ, వెంకటరమణ, గంగన్న పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



దుగ్గొండి, (సింగిడి): సాగునీరు అందక ఎండిపోతున్న పంటలతో నష్టపోతున్న రైతులకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నర్సంపేట గ్రామీణ మండలం గురిజాల గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు రైతులతో కలిసి ఎండిపోతున్న వరి, ఇతర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పంట నష్టంపై సర్వే చేయించి రైతులకు పరిహారం అందించాలని కోరారు. గతంలో అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం నష్టపోతున్న రైతులను కూడా ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు గడ్డం కొమురయ్య, బండారి రమేష్, అన్న రాజమల్లు, అల్లి రవి, మంచిక హరీష్, గజ్జి రాము, మంచిక దేవేందర్, పత్రి కుమారస్వామి, సంగం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలతో రైతులకు అవస్థలు



ఏడు గ్రామాలకు సరఫరాలో ఆటంకాలు.. సమస్య పరిష్కరించాలని రైతుల విజ్ఞప్తి

బిక్కనూర్, (సింగిడి): బిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్‌స్టేషన్ వద్ద ఏబీ స్విచ్‌తో పాటు ఇతర విద్యుత్ సామగ్రి అందుబాటులో ఉన్నప్పటికీ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కొనసాగుతున్నాయని రైతులు తెలిపారు. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలకు నీరు అందించడంలో ఇబ్బందులు



ఎదురవుతున్నాయని, పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించడంతో పాటు సబ్‌స్టేషన్‌కు వెళ్లి తమ సమస్యను వివరించారు. తరచూ లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) తీసుకోవాల్సి రావడంతో ఏడు గ్రామాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని రైతులు పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరా సజావుగా జరిగేలా చూడాలని, పంటలకు సాగునీరు అందించడంలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

-పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



తొర్రూరు, (సింగిడి): తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వి రెడ్డి అన్నారు. తొర్రూరు మున్సిపాలిటీలోని 6వ వార్డు అంబేద్కర్ నగర్ కు చెందిన రామారపు రామచంద్రు భార్య రామారపు పద్మ చికిత్స నిమిత్తం కోసం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదివారం రూ. 5 లక్షల ఎల్ఓసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. పేదల ఆరోగ్యానికి కావాల్సిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. సీఎంరిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొర్రూరు మాజీ సర్పంచ్,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పెదగాని సోమయ్య మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే మామిడాల యశస్వి రెడ్డి పేదలకు అండగా నిలుస్తుందన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన పద్మకు వైద్యం చేయించుకునే పరిస్థితి లేకపోవడం వల్ల ఎమ్మెల్యే ప్రభుత్వం నుండి ఎల్ఓసి అందించడం వల్ల వైద్యం చేయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికికృతజ్ఞతలు తెలిపారు.

బైంసాలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్మన్ దత్తత్రి



నిర్మల్ ప్రతినిధి, బైంసా (సింగిడి): బైంసా పట్టణంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు



తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకోవడం విశేషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

కాటారంలో విషాదం..

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

దసరా పండుగ వేళ విషాదం.. బల్బులు అమర్చుతుండగా ఘటన

కాటారం, (సింగిడి): కాటారం మండలంలోని చిదినపల్లి గ్రామంలో దసరా పండుగ వేళ విషాదం చోటుచేసుకుంది. పండుగ ఏర్పాట్లలో భాగంగా విద్యుత్ బల్బులు అమర్చుతుండగా బొతు కరుణాకర్ (20) విద్యుదాఘాతానికిగురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు,స్థానికులు తెలిపారు. కరుణాకర్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పండుగ వేళ యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సినిమా సింగిడి
Cinma Singidi

మంగళవారం
13-10-2026

singidinews@gmail.com



ఆ సినిమా నాకు పెద్ద గుణపాఠం నేర్పింది

కిరణ్ అబ్బవరం



భిన్నమైన కథలను, విభిన్న పాత్రలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో కిరణ్ అబ్బవరం. వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఆయన, ఇప్పుడు నటుడిగానే కాకుండా నిర్మాతగా, దర్శకుడిగా కూడా మారబోతూ తన మల్టీ టాలెంట్‌ను చూపిస్తున్నారు. 'గువ్వలచెరువు ఘాట్' సిరీస్‌తో ఓటీటీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడమే కాకుండా, 'రియాలిటీ' అనే సినిమాతో మెగాఫోన్ పట్టి దర్శకుడిగా మారనున్నారు. ఈ క్రమంలో తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో కిరణ్ అబ్బవరం తన కెరీర్, రాబోయే చిత్రాల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నేటి సమాజంలో మధ్యతరగతి యువత ఎదుర్కొంటున్న పెళ్లి ఒత్తిళ్ల నేపథ్యంలోనే 'రియాలిటీ' సినిమా కథ సాగుతుందని కిరణ్ తెలిపారు. పెళ్లి చేసుకోవాలనుకునే ఓ కుర్రాడి జీవితంలో ఎదురయ్యే సరదా సంఘటనలను ఈ చిత్రంలో వినోదాత్మకంగా చూపించబోతున్నామని చెప్పారు. ఈ సినిమా కోసం నటనతో పాటు దర్శకత్వ, రచన బాధ్యతలను కూడా తానే స్వయంగా తీసుకున్నట్లు స్పష్టం చేశారు. గత అనుభవాల గురించి మాట్లాడుతూ.. 2023లో విడుదలైన 'మీటర్' చిత్రాన్ని ప్రేక్షకులు తిరస్కరించడం తనకు పెద్ద గుణపాఠం నేర్పిందని కిరణ్ అబ్బవరం ఓపెన్‌గా అంగీకరించారు. సినిమాల్లో కొత్తదనం లేకపోతే జనాలు ఆదరించరని తనకు అర్థమైందని, ప్రేక్షకులు ట్రోల్ చేసేలోపే మనల్ని మనం సరిదిద్దుకోవాలని అన్నారు. అందుకే ఇప్పుడు తన తదుపరి చిత్రాల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇక తన లైనప్ గురించి చెబుతూ.. శ్రీకాంత్ పుష్పాల దర్శకత్వంలో 'ఇంద్రపుత్ర' సినిమా చేస్తున్నానని, ఇది పీరియాడిక్ చిత్రం కాకపోయినా మైథాలజీ టచ్‌తో సాగే నేటితరం కథ అని చెప్పారు. ఇందులో కత్తులు తిప్పుతూ భారీ కాస్ట్యూమ్స్‌లో కనిపించనున్నట్లు తెలిపారు.

జెండర్‌తో సంబంధం లేదు..

స్నిగ్ధ సెన్సేషనల్ కామెంట్స్



'అలా మొదలైంది' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి మంచి పాపులారిటీ సంపాదించుకున్న నటి, సింగర్ స్నిగ్ధ నయని తాజాగా చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె.. సింగింగ్ షోలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్నారు. అయితే ఇటీవల ఆమె ఓ అమ్మాయితో కలిసి పెళ్లి చేసుకున్నట్లుగా సోషల్ మీడియా లో ఓ వీడియోను షేర్ చేయడం పెద్ద సంచలనంగా మారింది. అంతేకాకుండా హనీమూన్‌కి కూడా వెళ్లడంతో ఆ వీడియోలు కాస్త వైరల్ కావడంతో నెటిజన్లు ఆమె నిజంగానే వివాహం చేసుకున్నారం టూ రకరకాలుగా చర్చించుకున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఒక యూట్యూబ్ చానెల్‌కి ఇచ్చిన ఇంట ర్వ్యూలో స్నిగ్ధ ఈ పెళ్లి రూమర్లపై స్పందిస్తూ అసలు నిజం బయట పెట్టారు.

రొమాంటిక్ రైడ్‌కు రంగం సిద్ధం..

ఇమ్రాన్ ఖాన్‌తో రొమాన్స్ చేయబోతున్న భూమి పెడ్నేకర్!

బాలీవుడ్‌లో విలక్షణమైన పాత్రలు ఎంచుకుంటూ, తన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి భూమి పెడ్నేకర్. డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమాలు చేస్తూ ప్రశంసలు అందుకున్న ఈ టాలెంటెడ్ బ్యూటీ.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. ఇమ్రాన్ ఖాన్ గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్న క్రేజీ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'అధురే హమ్ అధురే తుమ్' చిత్రంలో భూమి పెడ్నేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సమాచారం. 'కభీ కభీ అదితి జిందగీ మే..' పాటతో మిల్లీనియల్స్ మనసు దోచుకున్న ఇమ్రాన్ ఖాన్ చాలా కాలం తర్వాత మెయిన్ లీడ్ రోల్‌లో కనిపిస్తుండగా.. భూమి పెడ్నేకర్ పెర్ఫార్మెన్స్, ఆమె క్యారెక్టర్ ఈ సినిమాకు మెయిన్ హైలైట్‌గా నిలవనుందని తెలుస్తోంది. వైవిధ్యమైన స్క్రిప్టులు ఎంచుకోవడంలో పేరుగాంచిన భూమి, ఇమ్రాన్ కాంబినేషన్ తెరపై కొత్త మ్యాజిక్ క్రియేట్ చేయబోతోందని టాక్ నడుస్తోంది. ఈ చిత్రంలో గూర్ఖతేహ పీర్జాద కీలక పాత్రలో కనిపిస్తుండగా, ఫేమ్ దానిష్ అస్లామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్‌లో వచ్చిన 'హ్యాపీ పటేల్: ఖతర్నాక్ జసూస్' సినిమాలో చిన్న క్యామియో చేసిన ఇమ్రాన్.. ఇప్పుడు భూమి పెడ్నేకర్‌తో కలిసి చేయబోతున్న ఈ చిత్రం డిసెంబర్ 18న నేరుగా ఓటీటీ వేదికగా విడుదల కాబోతున్నట్లు సమాచారం.



కోలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్ దక్కించుకున్న శ్రీదేవి..

'కోర్ట్' సినిమాతో ఒక్కసారిగా ఓవర్ నైట్ స్టార్‌గా మారిన ముద్దుగుమ్మ శ్రీదేవి.. ఆ తర్వాత వచ్చిన చిత్రం అంతగా వర్కౌట్ కాకపోవడంతో టాలీవుడ్‌లో కాస్త గ్యాప్ ఇచ్చారు. అయితే ఏమాత్రం నిరుత్సాహపడకుండా చెన్నై బాట పట్టిన ఆమె.. కోలీవుడ్‌లో వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఆమె ఏగన్ సరసన నటించిన 'హైకూ' సినిమా అక్టోబర్ 23న థియేటర్లలో సందడి చేయడానికి రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో.. తాజాగా శ్రీదేవి తన తదుపరి కొత్త సినిమాను అఫీషియల్‌గా అనౌన్స్ చేసి సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన కొత్త ప్రాజెక్ట్ టైటిల్‌ను రివీల్ చేస్తూ ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'కొంచెం మధురమైన జ్ఞాపకాలు, ఎంతో ప్రేమ, ఎప్పటికీ నిలిచిపోయే అనుభూతులు. కొన్ని కథలు ఎప్పటికీ ముగియవు.. అవి కేవలం మన జ్ఞాపకాల్లో నిలిచిపోయే క్షణం కోసం వేచి చూస్తుంటాయి. హృదయానికి దగ్గరైన, గుర్తుంచుకోవడానికి వేచి ఉన్న కథను మీకు పరిచయం చేస్తున్నాం" అంటూ చాలా క్యూట్ క్యాప్షన్ జోడించారు. ఈ చిత్రానికి 'యువర్స్ లవింగ్లీ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇందులో ఆకాశ్ ప్రేమ్‌కుమార్ హీరోగా నటిస్తుండగా.. శ్రీదేవి ఆయన సరసన అల్లరి చూపులతో కనువిందు చేయనున్నారు. ఈ యూత్ ఫుల్ మ్యూజికల్ లవ్ స్టోరీని ముత్తురామ్ మురుగన్ డైరెక్ట్ చేస్తుండగా.. ఎంఆర్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ సెల్వరాజ్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఆఖరి దశకు చేరుకుందని, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని మేకర్స్ తెలిపారు. మొత్తానికి తమిళంలో బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్‌తో శ్రీదేవి తన సత్తా ఏంటో నిరూపించుకుంటున్నారు.

డబ్బు కోసం ఇంత దారుణమా..?

చిన్నారి హత్యపై రష్మి ఆవేదన

బొల్లారంలో ఐదేళ్ల చిన్నారి హత్య ఘటన తన మనసును తీవ్రంగా కలచివేసిందని నటి, యాంకర్ రష్మి



ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటే ఆమె తాజాగా ఈ దారుణ ఘటనపై స్పందించారు. మన సమాజం ఎటు వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు సోషల్ మీడియా తెరవాలని కూడా అనిపించడం లేదన్నారు. "ఐదేళ్ల చిన్నారిని గేటెడ్ కమ్యూనిటీ నుంచి అపహరించి క్రూరంగా హత్య చేశారు. అదీ డబ్బు కోసం.. దీని గురించి ఆలోచిస్తే రాత్రంతా నిద్రపట్టలేదు. మనం ఎక్కడికి వెళుతున్నాం? తప్పు ఎక్కడ జరుగుతోంది?. ఇవన్నీ చూస్తుంటే.. చిన్నారులు, మూగజీవాలకు రక్షణ లేని ప్రపంచంలోనే ఉండాల్సిన అవసరం లేదని అనిపిస్తోంది. వారిని రక్షించాల్సిన కనీస బాధ్యత మనపై లేదా?. ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట ఇలాంటి దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. మనుషులు ఎందుకు ఇంతగా దిగజారి ప్రవర్తిస్తున్నారు" అంటూ రష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

కాళ్లు, చేతులు కట్టేసి.. నీటి సంపులో పడేసి

బొల్లారంలో ఐదేళ్ల చిన్నారి హత్య కేసును పోలీసులు ఛేదించిన సంగతి తెలిసిందే. చిన్నారిని కిడ్నాప్ చేసి హత్య చేసిన ప్రధాన నిందితుడు, సెక్యూరిటీ గార్డు విక్రమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పోలీసులు గుర్తించారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737